
'ఖమ్మం' బరిలో వీరే...

నామా నాగేశ్వరరావు(బీఆర్ఎస్), యర్రా కామేష్ (బీఎస్పీ), రామసహాయం రఘురాంరెడ్డి(కాంగ్రెస్), తాండ్ర వినోద్‌రావు(బీజేపీ), అన్వర్ రయిస్ (సోషలిస్ట్ పార్టీ), ఆనంద్‌ప్రసాద్ కాశిన(పీపీఐ), ఆంథోని సురేష్(బీఎల్‌పీ), కుక్కల నాగయ్య (అలయన్స్‌ఆఫ్ డెమెక్రాటిక్ రిఫార్మ్ పార్టీ), కొప్పుల శ్రీనివాసరావు(జై భీంరావు భారత్‌పార్టీ), పాపెట్ల రామమూర్తి (సకలజనుల పార్టీ), భట్టు శ్రీనివాస్ (జై బీఎస్‌పీ). స్వతంత్రులు: ఎం.అనిల్‌కుమార్, ఎ.రాంబాబు, ఉల్లెంగల యాదగిరి, ఎ. చిట్టిమల్లు, కటుకోజ్వల నాగేశ్వరరావు, కాశిమల్ల నాగేశ్వరరావు, జి. కోటిరెడ్డి, స్టాలిన్, జోగ్రాంనాయక్, తంబళ్ల రవి, నాగేశ్వరరావు లకావత్, బి.నాగరాజు, ఎం.ఎర్రప్ప అజయ్, ఎం.సూర్యనారాయణ, ఎం.అర్జునరావు, ఎం.రవిచందర్‌చౌహాన్, లింగయ్య దండా, ఎల్.రవికుమార్, వి.రామకృష్ణ, షేక్ అజ్జులు, ఖలీల్‌పాషా, బాజీ బాబా, రసూల్, సిరాజుద్దీన్.

-ఖమ్మం కలెక్టరేట్

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5

భద్రాద్రి కొత్తగూడెం

మంగళవారం, 30 ఏప్రిల్ 2024



ఓటు విలువ తెలుపుతూ పినపాకలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

- ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను
- ఇల్లెందు, పినపాకలో ఫ్లాగ్‌మార్చ్

8

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి





ఖమ్మం జడ్పీసెంటర్‌లో జరిగిన కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న కేసీఆర్, పక్కన అభ్యర్థి నామా, మాజీ మంత్రి పువ్వాడ, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వరరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కందాళ

కేంద్రంలో వచ్చేది
సంకీర్ణ సర్కారే..

- నామాను గెలిపిస్తే కేంద్రమంత్రి అవుతారు
- గోదావరి జలాలు తరలిస్తే ఖమ్మం జిల్లాకు తీవ్ర నష్టం
- కాంగ్రెస్, బీజేపీలను ఓడించి బుద్ధిచెప్పండి
- జైళ్లకు, ప్రభుత్వానికి భయపడే వ్యక్తిని కాను
- ఎన్టీఆర్‌తోనే రాష్ట్రంలో సంక్షేమ పాలన మొదలైంది
- బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే ఖమ్మం జిల్లా అభివృద్ధి
- బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్
- ఖమ్మంలో రోడ్ షో.. జడ్పీ సెంటర్‌లో కార్నర్ మీటింగ్

ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల అనంతరం కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడుతుందని, ఖమ్మం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావును గెలిపిస్తే కేంద్రమంత్రి అవుతారని బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జోస్యం చెప్పారు. ఖమ్మంలో సోమవారం రాత్రి జరిగిన రోడ్‌షోలో ఆయన మాట్లాడారు. ఇచ్చంపల్లి నుంచి గోదావరి జలాలను కర్ణాటక, తమిళనాడుకు తరలించేందుకు ప్రయత్నిస్తుంటే కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, సీఎం రేవంత్‌రెడ్డి నోరు మెదపడం లేదని విమర్శించారు. చైతన్యవంతమైన ఖమ్మం జిల్లా ప్రజలు ఆలోచించి లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించాలని కోరారు. 6

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, ఖమ్మం

నేడు కొత్తగూడెంలో కేసీఆర్ రోడ్‌షో 6



ఖమ్మం, మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థులతో కలిసి అభివాదం చేస్తున్న బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డా.

మోదీ పాలనలో
అభివృద్ధి వికాసం

- 'ఒకే దేశం-ఒకే రాజ్యాంగం' కల సాకారమైంది
- పైప్‌లైన్ ద్వారా ఇంటింటికీ వంటగ్యాస్ అందిస్తాం
- స్మార్ట్‌సిటీల ద్వారా పట్టణాలు, నగరాల అభివృద్ధి
- వినోద్‌రావు, సీతారాంనాయక్‌లకు భారీ మెజారిటీ ఇవ్వాలి
- బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా
- గూడెంలో హోరెత్తిన ఎన్నికల ప్రచార సభ
- హాజరైన పలువురు నేతలు

ప్రధాని మోదీ పాలనలో దేశంలో అభివృద్ధి వికాసం చెందుతోందని, భద్రాచలం సీతారామచంద్రస్వామి, తిరుపతి వేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో బీజేపీ ఖమ్మం లోక్‌సభ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు, మహబూబాబాద్ అభ్యర్థి అజ్మీర సీతారాం నాయక్ గెలుపు ఖాయమని బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ధీమా వ్యక్తం చేశారు. భద్రాద్రి జిల్లా కేంద్రం సింగరేణి ప్రకాశం స్టేడియంలో సోమవారం బహిరంగసభ జరిగింది. 6

- లక్ష్మీదేవిపల్లి (కొత్తగూడెం)



కొత్తగూడెంలో సోమవారం జరిగిన బీజేపీ బహిరంగ సభకు హాజరైన జనం

పోలింగ్‌లో మూడు ఈవీఎంలు

- జాతీయ, రాష్ట్ర పార్టీల అభ్యర్థులకు మొదట చోటు



ఖమ్మం కలెక్టరేట్, ఏప్రిల్ 29: ఖమ్మం పార్లమెంట్ ఎన్నికల బరిలో 35 మంది ఉండడంతో మూడు ఈవీఎంలను వినియోగించనున్నారు. ఒక్కో ఈవీఎంలో కేవలం 15మంది అభ్యర్థులతోపాటు చివరి స్థానంలో నోటాకు గుర్తు ఉంటుంది. కానీ ఖమ్మం పార్లమెంట్ స్థానంలో 35మంది అభ్యర్థులు పోటీలో ఉండటంతో మూడు బ్యాలెట్ యూనిట్లను వినియోగించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మొదటి ఈవీఎంలో 15మంది, రెండో ఈవీఎంలో 15 మంది, మూడో ఈవీఎంలో మిగిలిన 5 అభ్యర్థుల పేర్లు ఉండనున్నాయి.

- తొలుత గుర్తింపు పొందిన జాతీయ, రాష్ట్ర పార్టీల అభ్యర్థులకు గుర్తులను కేటాయించారు. నామినేషన్ పత్రాల్లో తమ పేరు ఇంటి పేరు నమోదు చేయడంలో ఒక్కొక్కరిదీ ఒక్కో పద్ధతి అందుకే నామినేషన్లతో పాటు బ్యాలెట్‌లో అభ్యర్థి పేరు ఎలా ఉండాలని అభ్యర్థులు సూచించిన విధంగా బ్యాలెట్ పేపర్‌లో అభ్యర్థికి చోటు కేటాయించారు. అభ్యర్థుల ప్రాధాన్యత క్రమాన్ని నిర్ధారించేందుకు మొదట జాతీయ పార్టీలకు సంబంధించి అభ్యర్థుల పేర్లను, వారిచ్చిన పేరులో మొదటి అక్షరాలను పరిశీలించి తెలుగు వర్ణమాల (పెద్దబాలశిక్ష)లోని అక్షరాలు, గుణింతాల ఆధారంగా వరుస క్రమాన్ని నిర్ధారించారు.

- జాతీయ పార్టీల అభ్యర్థులను గుర్తించి వారికి వరుస నంబరు కేటాయించిన తర్వాత, గుర్తింపు పొందిన రాష్ట్ర పార్టీ అభ్యర్థులను నమోదు చేస్తారు. ఒకటికన్నా ఎక్కువ రాష్ట్ర పార్టీల అభ్యర్థులు ఉంటే వారికిచ్చిన పేరు, వివరాల ఆధారంగా తెలుగు వర్ణమాలను అనుసరించి వరుసలో కేటాయిస్తారు. ఆ తర్వాత స్వతంత్ర అభ్యర్థులను వర్ణమాల ఆధారంగా బ్యాలెట్ పత్రంలో పేర్లను కూర్చారు. వాటి ఆధారంగా గుర్తులను కేటాయించారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల, పొంగులేటి

ఖమ్మంలో అత్యధిక
మెజారిటీ సాధిస్తాం

- కాంగ్రెస్, వామపక్షాలతో సమన్వయ కమిటీ ఏర్పాటు చేస్తాం
- డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు తుమ్మల, పొంగులేటి
- ఎన్నికల కార్యాచరణపై ఎమ్మెల్యేలతో చర్చ

ఖమ్మం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఖమ్మం లోక్‌సభ స్థానంలో కాంగ్రెస్ పార్టీని రాష్ట్రంలోనే అత్యధిక మెజారిటీతో గెలిపిస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారాన్ని మరింత వేగవంతం చేసేందుకు లోక్‌సభ నియోజకవర్గ స్థాయిలో కాంగ్రెస్, వామపక్షాలతో కలిపి సమన్వయ కమిటీని ఏర్పాటు చేస్తున్నామని ప్రకటించారు. ఖమ్మంలోని భట్టి విక్రమార్క క్యాంపు కార్యాలయంలో సోమవారం ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని ఎమ్మెల్యేలతో సమావేశం నిర్వహించి ఎన్నికల వ్యూహాలపై చర్చించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ అధికారం కోల్పోయిన కేసీఆర్ నాలుగు నెలలకే ఆగలేకపోతున్నారన్నారు. ఆయన హయాంలోని పెండింగ్ బిల్లులన్నీ తామే చెల్లించామన్నారు. ఇప్పుడు సిగ్గు లేకుండా బస్సుయాత్ర పేరుతో వచ్చి బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఇళ్లల్లో కూర్చుని రాష్ట్రంలో కరెంట్ కోతలున్నాయని ఆరోపణలు చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ 15 లోక్‌సభ స్థానాలు గెలుస్తుందని, అందులో ఖమ్మం స్థానాన్ని అత్యధిక మెజారిటీతో గెలవబోతున్నామన్నారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డా కొత్తగూడెం సభలో కాంగ్రెస్ అవినీతి పార్టీ అని మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. దేశంలో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలే అతిపెద్ద అవినీతి పార్టీలన్నారు. గత పదేళ్లలో దేశ సంపదను ప్రధాని మోదీ, రాష్ట్ర సంపదను కేసీఆర్ దోచుకున్నారన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఈ రెండు పార్టీలకు రాష్ట్ర ప్రజలు గుణపాఠం చెప్పారని, లోక్‌సభ ఎన్నికల్లోనూ ఈ రెండు పార్టీలకు కర్రుకాల్చి వాత పెట్టబోతున్నారన్నారు.

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు భారీగా కాంగ్రెస్ పక్షాన నిలిచి రేవంత్‌రెడ్డిని సీఎం చేసుకున్నామని, అలాగే లోక్‌సభ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా నిలిచి రాహుల్‌గాంధీని ప్రధానిని చేసుకోవాలని సూచించారు. వచ్చే నెల 4న కొత్తగూడెంలో సీఎం రేవంత్‌రెడ్డి సభ ఉంటుందని, దానిని విజయవంతం చేయాలని కోరారు. రెవెన్యూ, సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్ ఏ ముఖం పెట్టుకుని ప్రజల వద్దకు వస్తున్నారన్నారు. మొన్నటి వరకు ఈ ప్రభుత్వం పడిపోతుందని, అధికారంలో ఉండదని చెప్పిన ఆయన మళ్లీ లోక్‌సభ ఎన్నికల్లో బస్సుయాత్ర పేరుతో చేతిలో కర్ర పట్టుకుని తిరుగుతున్నారని ఎద్దేవా చేశారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్‌కు అనుకూల పవనాలున్నాయన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి మాట్లాడుతూ ఖమ్మం జిల్లా కాంగ్రెస్‌తోపాటు వామపక్ష పార్టీలు సమైక్యంగా నిలిచి తన విజయానికి కృషి చేస్తున్నాయని తెలిపారు. సమావేశంలో ఎమ్మెల్యేలు రాందాస్‌నాయక్, జారె ఆదినారాయణ, మట్టా రాగమయి, ఖమ్మం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నగర అధ్యక్షుడు జావీద్, రాయల నాగేశ్వరరావు, పోట్ల నాగేశ్వరరావు, ముువ్వా విజయ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

మే 4న కొత్తగూడేనికి
సీఎం రేవంత్‌రెడ్డి



ఖమ్మం, మహబూబాబాద్ లోక్‌సభ స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ మే 4న ఉదయం 10 గంటలకు కొత్తగూడెంలో ముఖ్యమంత్రి, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి బహిరంగ సభ నిర్వహించబోతున్నారు. ఈ సభకు సన్నాహక ఏర్పాట్లను కాంగ్రెస్ పార్టీ ప్రారంభించింది. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నివాసంలో మంత్రులు తుమ్మల, పొంగులేటితోపాటు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు రాందాస్ నాయక్, మట్టా రాగమయి, జారే ఆదినారాయణ తదితరులు సమావేశమయ్యారు. ఎన్నికల ప్రచారానికి ప్రత్యేక సమన్వయ కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. సీపీఎం, సీపీఐలతో కలిపి లోక్‌సభ నియోజకవర్గాల వారిగా మంగళవారం సమన్వయం కమిటీలను ఖరారు చేయబోతున్నారు.

మిగిలిన వారు
35 మంది

- ప్రధాన పార్టీల తరపున నలుగురు..
- స్వతంత్రులు 24 మంది...
- బరి నుంచి తప్పుకున్న ఆరుగురు
- నామినేషన్ ఉపసంహరించుకున్న పోట్ల

ఖమ్మం కలెక్టరేట్, ఏప్రిల్ 29: ఖమ్మం లోక్‌సభ బరిలో 35 మంది అభ్యర్థులు నిలిచారు. సోమవారం సాయంత్రం 3గంటలకు నామినేషన్ల ఉపసంహరణ అనంతరం వీరంతా ఎన్నికల బరిలో నిలిచినట్లు రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ వీపీ గౌతమ్ ప్రకటించారు. నామినేషన్ దాఖలు చివరిరోజున మొత్తం 45మంది అభ్యర్థులు తమ నామినేషన్లు దాఖలు చేయగా.. ఈనెల 26న నామినేషన్ల పరిశీలనలో నలుగురి నామినేషన్లను రిటర్నింగ్ అధికారి వివిధ కారణాలతో తిరస్కరించారు. కాగా మొత్తం 41మంది అభ్యర్థుల నామినేషన్లు సక్రమంగా ఉన్నాయి. సోమవారం నామినేషన్ల ఉపసంహరణలో ఆరుగురు స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. లోక్‌సభ బరిలో కాంగ్రెస్,బీజేపీ, బీఆర్ఎస్‌తోపాటు బీఎస్పీ గుర్తింపు పొందిన పార్టీల నుంచి అభ్యర్థులు పోటీలో ఉన్నారు. ఈ సారి పోటీలో అత్యధికంగా స్వతంత్ర అభ్యర్థులే ఉన్నారు.

ప్రధాన పార్టీల నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా రామసహాయం రఘురాంరెడ్డి, టీఆర్ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు, బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు, బీఎస్పీ అభ్యర్థిగా ఎర్రా కామేష్ ప్రధాన పోటీదారులుగా ఉన్నారు. సోమవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నాం 3గంటల వరకు కలెక్టర్ వీపీ గౌతమ్ నామినేషన్ల ఉపసంహరణ కోసం వేచి ఉన్నారు. ఒక్కొక్కరుగా వచ్చి తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. బరిలో నుంచి తప్పుకున్న వారిలో పోట్ల నాగేశ్వరరావు, సోమగాని నరేందర్, మారం వెంకటరెడ్డి, తండు ఉపేందర్, లింగం కృష్ణ, వడిత్యా వినోద ఉన్నారు. వీరందరి నుంచి ఫారం-6 ద్వారా దరఖాస్తులను స్వీకరించి ఫారం 40 ద్వారా దరావత్ సొమ్మును వారికి చెక్కుల రూపంలో అందజేశారు.

గుర్తుల కేటాయింపు పూర్తి

లోక్‌సభకు నామినేషన్ల ఉపసంహరణ అనంతరం సోమవారం సాయంత్రం స్వతంత్ర అభ్యర్థులకు ఎన్నికల గుర్తులను కేటాయించారు. రిటర్నింగ్ అధికారి కలెక్టర్ వీపీ గౌతమ్ ఆధ్వర్యంలో స్వతంత్ర అభ్యర్థులతో సోమవారం సాయంత్రం సమావేశాన్ని నిర్వహించారు. నామినేషన్ల సమయంలోనే అభ్యర్థులు మూడు గుర్తులను కోరుకుంటూ ప్రాధాన్యత క్రమంలో ఇచ్చారు. దీంతో వారి సమక్షంలోనే గుర్తులను కేటాయించారు. జాతీయ, రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందిన పార్టీలు, రిజిస్టర్ పార్టీలకు ఎన్నికల సంఘం కేటాయించిన గుర్తులను కేటాయించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలల్లో
సౌకర్యాలు సమకూర్చాలి

- వెంటనే మరమ్మతు పనులు ప్రారంభించాలి
- ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారులతో ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్ సమీక్ష

7

స్వతంత్రులూ
తక్కువేమీ కాదు!



- ఖమ్మంలో 24మంది, మహబూబాబాద్‌లో ఆరుగురు
- ప్రధాన పార్టీల మెజారిటీలపై ప్రభావం?

6

సోషల్ మీడియాలో
బీకేర్‌ఫుల్



- రెచ్చగొట్టే పోస్టులు పెడితే కఠిన చర్యలు
- పోలీస్ కమిషనర్ సునీల్‌దత్

6

నేడు కొత్తగూడెంలో
కేసీఆర్ రోడ్‌షో

» రాత్రికి సింగరేణి అతిథి గృహంలో బస

కొత్తగూడెం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం, మహబూబాబాద్ లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థులు నామా నాగేశ్వరరావు, మాలోత్ కవితల విజయాన్ని కాంక్షిస్తూ మంగళవారం ఆ పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం కేసీఆర్ మంగళవారం భద్రాద్రి జిల్లా కేంద్రమైన కొత్తగూడెంలో రోడ్ షో నిర్వహించనున్నారు. సాయంత్రం 5 గంటలకు కొత్తగూడెంలోని పోస్టాఫీస్ సెంటరు నుంచి కేసీఆర్ రోడ్‌షో ప్రారంభమవుతుంది. రైల్వేస్టేషన్ సమీపంలో జరిగే కార్నర్ మీటింగ్‌లో ఆయన ప్రసంగిస్తారు. కేసీఆర్ వెంట రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు, ఎమ్మెల్సీ తాతా మధు, మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు తదితరులు రోడ్‌షోలో పాల్గొంటారు. అనంతరం కొత్తగూడెంలోని ఇల్లెందు సింగరేణి అతిథిగృహంలో మంగళవారం రాత్రి కేసీఆర్ బసచేయనున్నారు. బుధవారం ఉదయం ఆయన మహబూబాబాద్ నియోజకవర్గ పర్యటనకు వెళ్లనున్నారు. కేసీఆర్ పర్యటన బీఆర్ఎస్ శ్రేణుల్లో ఉత్సాహం నింపనుంది.

పార్లమెంట్ ఎన్నికలకు
సర్వం సిద్ధం

» భద్రాద్రి జిల్లా ఎన్నికల అధికారి ప్రియాంక

కొత్తగూడెం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పార్లమెంట్ ఎన్నికలకు సర్వం సిద్ధం చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి ప్రియాంక అల తెలిపారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల నామినేషన్ ఉపసంహరణ చివరి తేదీ, అనంతరం ఎన్నికల సంఘం ప్రకటించిన అ భ్యర్థులు ఖమ్మం పార్లమెంట్ పరిధిలో 35మంది అభ్యర్థులు, మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలో 23మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచారని తెలిపారు.

ఎన్నికల్లో విధులు నిర్వహించే ప్రిసైడింగ్ అధికారులు, ఏపీవోలు ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ల (ఈవీఎం)పై అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి ప్రియాంక అల సూచించారు. సోమవారం కొత్తగూడెం ఆర్డీవో కార్యాలయంలో ఉన్న ఈవీఎం గోడౌన్‌ను పరిశీలించారు. ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక అల అధికారులను ఆదేశించారు. సోమవారం ఐటీడీసీ సమావేశ మందిరంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు, దివ్యాంగుల కోసం చేసిన ఏర్పాట్లు, తాగునీటి సౌకర్యం, విద్యుత్, మరుగుదొడ్ల సౌకర్యం ఉందా.. లేదా పరిశీలించాలన్నారు. అధిక ఉష్ణోగ్రతల దృష్ట్యా ప్రతి పోలింగ్ కేంద్రం ముందు విధిగా షామియానాలు, తాగునీరు ఏర్పాటు చేయవల్సిందిగా అధికారులను ఆదేశించారు. పరిస్థితులను ముందుగానే గమనిస్తూ ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు.

కేంద్రంలో వచ్చేది సంకీర్ణ సర్కారే..



ఖమ్మంలో కేసీఆర్ బస్సు యాత్ర

ఖమ్మం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): కేంద్రంలో రాబోయేది సంకీర్ణ ప్రభుత్వమేనని, ఖమ్మం నుంచి నామా నాగేశ్వరరావును గెలిపిస్తే ఆ సంకీర్ణ ప్రభుత్వంలో కేంద్ర మంత్రి అవుతారని బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ధీమా వ్యక్తం చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్‌లను ఓడించి బుద్ధిచెప్పాలని పిలుపునిచ్చారు.

లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా కేసీఆర్ చేపట్టిన బస్సుయాత్ర వరంగల్ జిల్లా నుంచి సోమవారం రాత్రి ఖమ్మం నగరానికి చేరుకుంది. ఈ సందర్భంగా నగరంలోని కాల్వొడ్డు, మయూరిసెంటర్, జడ్పీసెంటర్, ఇల్లెందు క్రాస్ రోడ్డు, శ్రీశ్రీసర్కిల్ వరకు రోడ్‌షో నిర్వహించారు. కేసీఆర్‌కు బీఆర్ఎస్ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. ర్యాలీలో కార్యకర్తలు గులాబీజెండాలతో కదం తొక్కారు. ఖమ్మం మయూరిసెంటర్‌లో బీఆర్ఎస్ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు, మాజీమంత్రి పువ్వాడ అజయ్ కుమార్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వరరెడ్డితో పాటు మాజీ ఎమ్మెల్యేలు కేసీఆర్‌కు ఘనస్వాగతం పలికారు.

జడ్పీసెంటర్‌లో జరిగిన కార్నర్ మీటింగ్‌లో కేసీఆర్ మాట్లాడుతూ ప్రధాని మోదీ, సీఎం రేవంత్‌రెడ్డిలపై కేసీఆర్ విమర్శనాస్త్రాలు గుప్పించారు. దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆర్ సంక్షేమపాలనను గుర్తుచేశారు. ఇచ్చంపల్లి నుంచి గోదావరిజలాలను కర్ణాటక, తమిళనాడుకు తరలించేందుకు ప్రయత్నిస్తుంటే కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, సీఎం రేవంత్‌రెడ్డిలు ఎందుకు నోరు మెదపడంలేదన్నారు. తాను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రధాని మోదీ గోదావరి జలాలు తరలించే ప్రతిపాదన తెస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ రాష్ట్రానికి వచ్చే నీళ్ల లెక్క తేల్చేదాకా నా తల తెగిపడినా సరే నీరు తీసుకెళ్లేందుకు ఒప్పుకునేది లేదని తేల్చి చెప్పానన్నారు.

ఎన్టీఆర్, చంద్రబాబు స్ఫూర్తితో రాజకీయాల్లోకి వచ్చా: నామా నాగేశ్వరరావు

తాను ఎన్టీఆర్, చంద్రబాబు స్ఫూర్తితో రాజకీయాల్లోకి వచ్చానని బీర్ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు తెలిపారు. నిజాయితీగా రాజకీయాలు కొనసాగించానని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జిల్లాలో రూ.50వేల కోట్లతో అభివృద్ధి జరిగిందన్నారు. తెలంగాణ వాణి పార్లమెంట్‌లో వినిపించాలంటే బీఆర్ఎస్ ఎంపీలను గెలిపించాల్సిన అవసరం ఉందన్నారు. మూడోసారి ఎంపీగా తనను గెలిపించాలని కోరారు.

అనంతరం జడ్పీసెంటర్ నుంచి శ్రీశ్రీ సర్కిల్ వరకు కోలాహలంగా బస్సుయాత్ర నిర్వహించారు. బీఆర్ఎస్ కార్యకర్తలు బస్సుయాత్ర వెంట పరుగులు తీశారు. రోడ్ షోలో ఖమ్మం జడ్పీచైర్మన్ లింగాల కమల్‌రాజ్, మాజీఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, కందాళ ఉపేందర్‌రెడ్డి, బానోతు మదన్‌లాల్, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ తదితరులు పాల్గొన్నారు. కేసీఆర్ రాత్రి మాజీమంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ నివాసంలో బస చేశారు. మంగళవారం తల్లాడ, కొత్తగూడెంలో బస్సుయాత్ర కొనసాగనుంది.

గోదావరి జలాలు తరలిస్తే తెలంగాణకు తీవ్ర నీటి సమస్య తప్పదని హెచ్చరించారు. కేంద్రంలో బీజేపీ 400, 370 సీట్లు వస్తాయని చెబుతోందని కానీ ఆ పార్టీకి 200సీట్లు కూడా దాటవని ప్రపంచం కోడై కూస్తోందన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ 12 ఎంపీ సీట్లు గెలవబోతున్నట్లు కేసీఆర్ ప్రకటించారు. ఖమ్మంలో నామా నాగేశ్వరరావును గెలిపిస్తే కేంద్రంలో ఏర్పడే సంకీర్ణ ప్రభుత్వంలో ఆయన కేంద్ర మంత్రి అవుతారన్నారు. ఆయన మంత్రి అయితే ఖమ్మం జిల్లా సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. చైతన్యవంతులైన ఖమ్మం ప్రజలు ఆలోచించి లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి నామాను గెలిపించాలన్నారు.

ఖమ్మం జిల్లాను 75 ఏళ్లుగా ఎవరు పట్టించుకోలేదని కేసీఆర్ విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో 37 టీఎంసీల నీటిని ఖమ్మం జిల్లాకు తరలించి సస్యశ్యామలం చేసేందుకు సీతారామ ప్రాజెక్టు ఏర్పాటు చేసుకున్నామని, దీంతో సాగర్‌లో నీరు లేకపోయినా గోదావరి జలాలతో పంటలు పండించేందుకు ప్రాజెక్టు ఏర్పాటు చేశామన్నారు. ఇచ్చంపల్లినుంచి గోదావరి జలాలు ఎత్తుకెళితే ఈ జిల్లాకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు.



ప్రసంగిస్తున్న కేసీఆర్

తెలంగాణ ఉద్యమంలో తనను అరెస్టు చేసి ఇదే ఖమ్మం జిల్లా జైలులో ఉంచారని, అప్పుడు ఖమ్మం జిల్లా బిడ్డలు ఉద్యోగులు, విద్యార్థులు, కమ్యూనిస్టు పార్టీలు అన్ని వర్గాలు బ్రహ్మాండంగా ఆశీర్వదించారని, ఆ సంఘటన మరిచిపోలేనని గుర్తు చేశారు. తెలంగాణ వచ్చిన తర్వాత పదేళ్లలో ఒక్కొక్క సమస్య పరిష్కరించుకుంటూ ఎంతో అభివృద్ధి చేశామన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అడ్డగోలు హామీలు ఇచ్చిందని, ఇప్పటి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇష్టానుసారంగా అబద్దపు ప్రచారం చేశారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ గతంలో కూడా "దున్నేవాడికి భూమి, తినేవాడికి ఇస్తరి" అంటూ, "అమ్మను చూడు.. ఆవుదూడ బొమ్మను చూడు" అంటూ ప్రజలను మోసం చేసి ఓట్లు దండుకుందన్నారు. ఎన్టీఆర్ వచ్చిన తరువాతనే నిజమైన సంక్షేమపాలన ప్రారంభమైందన్నారు. తెలంగాణ వచ్చిన తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎన్టీఆర్‌కు మించి పథకాలు అమలు చేశామన్నారు. రైతుబంధు, రైతుబీమా, 24గంటల కరెంట్, ధాన్యం కొనుగోలు, కళ్యాణలక్ష్మి వంటి పథకాలు అమలు చేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదన్నారు. డిసెంబరు 9నే రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తానన్న రేవంత్ రెడ్డి ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. తాము తొమ్మిదేళ్లు కరెంట్ పోకుండా ఇస్తే ఈ నాలుగు నెలల్లోనే విద్యుత్ కోతలు అమలవుతున్నాయన్నారు. ఇది ఈ ప్రభుత్వ వైఫల్యాలకు నిదర్శనమన్నారు. మాజీమంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఖమ్మంలో ఎంతో అభివృద్ధి జరిగిందని, కానీ ఇప్పుడు ఖమ్మంలో తాగునీటి సమస్య ఉందన్నారు. చైతన్యవంతమైన ఖమ్మం జిల్లా ప్రజలు ఆలోచించి రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించాలని, యువత చైతన్యవంతంగా కదలాలని, అసెంబ్లీ ఎన్నికల్లో జరిగిన పొరపాటును మళ్లీ చేయవద్దని విజ్ఞప్తి చేశారు.

రాష్ట్రంలో బీఆర్ఎస్ సునామి

» 12సీట్లు గెలువబోతున్నాం

» లోక్‌సభ నియోజకవర్గస్థాయి సమావేశంలో కేసీఆర్

ఖమ్మం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): రాష్ట్రంలో 12 లోక్‌సభ స్థానాలను గెలుచుకొని సునామి సృష్టించబోతున్నదని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పేర్కొన్నారు. అందులో ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గం కూడా ఉన్నదని అన్నారు. సోమవారం రాత్రి మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ నివాసంలో ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గ స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్యనేతలందరూ పాల్గొన్నారు. కేసీఆర్ మాట్లాడుతూ ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గం ముందంజలో ఉన్నదని పలు సర్వేలలో తెలిసిందని, నియోజకవర్గ నాయకులంతా కష్టపడి పనిచేస్తే ఖమ్మం నుంచి నామా విజయం ఖాయమని కేసీఆర్ తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు తోపాటు ఎంపీ వద్దిరాజు రవిచంద్ర ఎమ్మెల్యే పల్లారాజేశ్వరరెడ్డి, ఎమ్మెల్సీ తాతామధుసూదన్, మేయర్ నీరజ, జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, మదన్‌లాల్, కందాల ఉపేందర్‌రెడ్డి, మెచ్చా నాగేశ్వరరావు, కొండబాల కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు
సహకరించాలి

» పరిశీలకుడు సంజయ్ జి కోల్టే

ఖమ్మం కలెక్టరేట్, ఏప్రిల్ 29: ప్రశాంత ఎన్నికల నిర్వహణకు రాజకీయ పార్టీలు, పోటీ అభ్యర్థులు సహకరించాలని ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల సాధారణ పరిశీలకుడు డాక్టర్ సంజయ్ జి కోల్టే అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్, పోలీస్ పరిశీలకులు చరణ్‌జీత్ సింగ్, వ్యయ పరిశీలకులు అరుణ్ ప్రసాత్ కృష్ణసామి, శంకర ఆనంద్ మిశ్రా లతో కలిసి రాజకీయ పార్టీలు, అభ్యర్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఖచ్చితంగా పాటించాలన్నారు. డబ్బు, మద్యం, ప్రలోభాల నియంత్రణ కు నిఘా పెట్టినట్లు తెలిపారు. ఈవీఎంల ప్రిపరేషన్, గుర్తుల లోడింగ్‌లో, స్ట్రాంగ్ రూం లను తెరిచేప్పుడు పోటీచేసే అభ్యర్థులు పాల్గొనాలన్నారు. పోలింగ్ ఏజెంట్లను నియమించాలని అన్నారు.

రైతు వ్యతిరేక చట్టాలను
పార్లమెంట్‌లో అడ్డుకున్నా

» కూరగాయల మార్కెట్‌లో ఎన్నికల ప్రచారంలో నామా

ఖమ్మం కార్పొరేషన్, ఏప్రిల్28: కేంద్రం రూపొందించిన రైతు వ్యతిరేక చట్టాలను పార్లమెంట్‌లో అడ్డుకున్నానని ఖమ్మం పార్లమెంటరీ బీఆర్ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు పేర్కొన్నారు. సోమవారం నామా నగరంలోని రాపర్తినగర్‌లోని కూరగాయల మార్కెట్‌లో వ్యాపారులను కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ఖమ్మంజిల్లా బిడ్డనని, ఇక్కడే రోజువారీ కూలీకి పనిచేశానన్నారు. కూరగాయల రైతుల కష్టాలు తనకు తెలుసన్నారు. పార్టీలకు అతీతంగా తాను ఎవరికి సమస్యలు వచ్చినా పరిష్కరించానని, తిరిగి తనను ఎంపీగా గెలిపించేందుకు సహకరించాలని కోరారు. తన మీద బయట నుంచి వచ్చిన వ్యక్తులను పోటీలో ఉంచారని, వారికి జిల్లాలో సమస్యలు తెలవవని నామా పేర్కొన్నారు. రెండుసార్లు తనను గెలిపించి పార్లమెంట్‌కు పంపితే జిల్లా సమస్యలను పార్లమెంట్‌లో ప్రస్తావించి, ఎన్నో సమస్యలను పరిష్కరించామన్నారు. రైతులకు గిట్టుబాటు ధరలకోసం బీఆర్ఎస్ ఎంపీలు పార్లమెంట్‌ను స్తంభించచేశారని నామా తెలిపారు. క్షేత్రస్థాయిలో గడప గడపకు వెళ్లి కాంగ్రెస్ చేసిన మోసాన్ని ప్రజలకు వివరించి, తనను ఎంపీగా మూడోసారి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని నామా కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు పొన్నం వేంకటేశ్వర్లు, తోట రామారావు, మోరంపూడి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



కూరగాయల మార్కెట్‌లో ఓట్లను అభ్యర్థిస్తున్న బీఆర్ఎస్ ఖమ్మం ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు



సోషల్ మీడియాలో
బీకేర్‌ఫుల్

» రెచ్చగొట్టే పోస్టులు పెడితే కఠిన చర్యలు

» పోలీస్ కమిషనర్ సునీల్‌దత్

ఖమ్మం క్రైం, ఏప్రిల్ 29: సోషల్ మీడియా వేదికగా ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తూ రెచ్చగొట్టే విధంగా పోస్టులు పెడితే కఠిన చర్యలు తప్పవని పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ సోమవారం రాత్రి ఒక ప్రకటనలో హెచ్చరించారు. తప్పుడు పోస్టులతో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారి పట్ల పోలీసు శాఖ కఠినంగా వ్యవహరిస్తుందని పేర్కొన్నారు. శాంతి భద్రలకు విఘాతం కలిగించే ఫొటోలు, వీడియోలు పోస్ట్‌చేసినా, వ్యక్తిగత దూషణలకు పాల్పడినా, ఇతరులను హెచ్చరిస్తూ పోస్టులు పెట్టినా చట్టపరమైన చర్యలు తప్పవని పేర్కొన్నారు. సోషల్ మీడియా సైట్లపై కమిషనరేట్ సోషల్ మీడియా యూనిట్ ఆధ్వర్యంలో 24/7 నిఘాపెట్టి పర్యవేక్షిస్తుందని తెలిపారు. ఎవరైనా ఇతర వ్యక్తులు, రాజకీయ పార్టీలను ఉద్దేశించి అనుచితమైన వాఖ్యలు, పోస్టింగ్‌లు పెడితే చట్ట ప్రకారం కేసులు నమోదుచేసి, ఎలక్ట్రానిక్ డివైజులు సీజ్ చేస్తామని అన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం

» కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి

» పాల్గొన్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మంత్రి పొంగులేటి



కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న రఘురాంరెడ్డి

అన్నపురెడ్డిపల్లి/ ములకలపల్లి/ పాల్వంచ, ఏప్రిల్ 29: ఖమ్మం పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎంపీగా తనని గెలిపిస్తే ప్రజల సంక్షేమం కోసమే పని చేస్తా అని రామసహాయం రఘురాంరెడ్డి తెలిపారు. సోమవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా అన్నపురెడ్డిపల్లి, ములకలపల్లి మండలాల్లో నిర్వహించిన సమావేశాల్లో పాల్వంచ రోడ్‌షో, కార్నర్ మీటింగ్‌లలో ఆయన మాట్లాడారు. ఖమ్మం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా తనని గెలిపించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ భారీ మెజారిటీ కోసం కార్యకర్తలంతా కృషి చేయాలని సూచించారు. తాను ఎంపీగా గెలిస్తే ఏడో గ్యారెంటిగా ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలకు అందుబాటులో ఉంటూ సమగ్ర అభివృద్ధికి దోహదపడతానని రఘురాంరెడ్డి హామీ ఇచ్చారు. అశ్వారావుపేట నియోజక వర్గ ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మాట్లాడుతూ ఇచ్చిన ప్రతి గ్యారంటీని అమలు చేస్తామన్నారు. వామపక్ష నాయకులు సీపీఎం ముదిగొండ రాంబాబు, సీపీఐ నరాటి ప్రసాద్ మాట్లాడుతూ దేశంలో నుంచి బీజేపీని పంపించవల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు.

బీజేపీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లను రద్దుచేస్తుందని అన్నారు. పాల్వంచ ప్రజలు ఎమ్మెల్యే కూనంనేని ఆదరించి భారీ మెజారిటీతో ఎలా గెలిపించారో అదే విదంగా రఘురాంరెడ్డిని గెలిపించి పార్లమెంట్‌కు పంపాలని రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. కొత్తగూడెం నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడానికి తాము సిద్దంగా ఉన్నామని, నియోజకవర్గంలోని అన్ని సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని, కేంద్రంలో రాహుల్‌గాంధీ ప్రధాని కావాలంటే ఇక్కడ రఘురాంరెడ్డికి ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కోరారు.

ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు బాలసాని లక్ష్మీనారాయణ, మువ్వా విజయబాబు, స్వర్ణకుమారి, పర్సా వెంకటేశ్వరరావు, వనమా గాంధీ, వేముల రమణ, మల్లే నర్సింహరావు, బీముడు, అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

మోదీ పాలనలో
అభివృద్ధి వికాసం

» బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా

లక్ష్మీదేవిపల్లి (కొత్తగూడెం), ఏప్రిల్ 29: ప్రధాని మోదీ పాలనలో దేశంలో అభివృద్ధి వికాసం చెందుతోందని, భద్రాచలం సీతారామచంద్ర స్వామి, తిరుపతి వేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో బీజేపీ ఖమ్మం లోక్‌సభ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు, మహబూబాబాద్ అభ్యర్థి అజ్మీర సీతారాంనాయక్‌ల గెలుపుఖాయమని బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ధీమా వ్యక్తం చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రం సింగరేణి ప్రకాశం స్టేడియంలో సోమవారం జరిగిన బహిరంగసభలో ఆయన మాట్లాడారు. మండుటెండను సైతం లెక్కచేయకుండా సభకు వచ్చిన ప్రజానీకాన్ని చూస్తే బీజేపీ గెలుపు ఖాయంగా కనిపిస్తోందని నడ్డా అన్నారు. దేశం ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్న దశలో బీజేపీకి ఓటు వేసి గెలిపించి అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని కోరారు. కుటుంబపాలనతో, కుంభకోణాలతో కాంగ్రెస్ పాలన సాగించిందని విమర్శించారు. పదేళ్ల క్రితం బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉత్పత్తి, ఎగుమతులు తదితర రంగాలన్నింటినీ అభివృద్ధి చేసిందన్నారు. ఒకప్పుడు మేడిన్ చైనా, మేడిన్ జపాన్ ఉత్పత్తులు కనపడేవని, ప్రస్తుతం మోదీ హయాంలో మేకిన్ ఇండియా, మేడిన్ ఇండియా దిశగా భారత్ అభివృద్ధి సాధించిందన్నారు.

జమ్మూకశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దుతో ఒకే దేశం, ఒకే రాజ్యాంగంగా ఆవిర్భవించిందన్నారు. మోదీని గెలిపిస్తే రానున్న కాలంలో ప్రజలు గ్యాస్ సిలిండర్లను మోయాల్సిన పనిలేదని ఇంటింటికి పైపులైన్ ఏర్పాటుచేసి గ్యాస్ పంపిణీ చేసేందుకు కృషిచేస్తామన్నారు. ఆయూష్మాన్ భారత్ కింద 70సంవత్సరాలు దాటిన వారికి రూ.ఐదులక్షల ఉచిత వైద్యాన్ని అందిస్తామన్నారు. అదేవిధంగా రేషన్ బియ్యాన్ని కూడా యథావిధిగా కొనసాగిస్తామన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పిస్తామని భరోసా ఇచ్చారు. దేశంలో ముఖ్యమైన నగరాలు, పట్టణాలను స్మార్ట్‌సిటీలుగా అభివృద్ధి చేస్తున్నామని దీనిలో భాగంగానే తెలంగాణ రాష్ట్రంలో కూడా వరంగల్, కరీంనగర్, హైదరాబాద్‌లను స్మార్ట్ సిటీలుగా ఏర్పాటుచేసి అభివృద్ధి చేస్తున్నట్టు తెలిపారు. రూ.పదివేల కోట్లతో సికింద్రాబాద్‌తోపాటు ఇతర రైల్వే మార్గాలను ఆధునీకరణ చేపట్టామన్నారు. బీజేపీ ఎంపీ కె.లక్ష్మణ్ మాట్లాడుతూ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై ప్రజలకు విశ్వాసం పోయిందని, రెండు రెండేనని ఎవరికి ఓటు వేసినా ఉపయోగం లేదన్నారు. ఎన్నికల్లో ఓట్లు దండుకున్న కాంగ్రెస్ పార్టీ గెలిచిన తర్వాత ప్రజలకు ఇచ్చిన హామీలను మర్చిపోయి ప్రజలను మోసం చేశారని గుర్తు చేశారు. అదేవిధంగా కమ్యూనిస్టులు తమ సిద్ధాంతాలను మరిచి అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారని, కేరళలో కాంగ్రెస్‌తో కుస్తీపడుతూ తెలంగాణలో దోస్తీకట్టడం విడ్డూరంగా ఉందన్నారు.

కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎత్తు మూడు ఫీట్లు.. మాటలు మాత్రం పన్నెండు ఫీట్లు ఉంటాయని ఎద్దేవా చేశారు. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు ఎత్తేస్తామని అసత్య ప్రచారం చేసుకుంటూ ప్రజల వద్ద నుంచి ఓట్లు పొందాలని చూస్తున్నారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన గ్యారెంటీ హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందన్నారు.

ఖమ్మం లోక్‌సభ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు మాట్లాడుతూ తాను ఉమ్మడి ఖమ్మం జిల్లా వాసినని, పక్కాలోకల్ అని, జిల్లాలోని సమస్యల పట్ల అవగాహన ఉందన్నారు. బీజేపీకి ఓటు వేసి తనను గెలిపిస్తే జిల్లా సమస్యలను ప్రధానమంత్రి మోదీ దృష్టికి తీసుకెళ్లి అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. భూములను గుర్తించి ఐటీ, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేస్తానని, అదేవిధంగా 600ఎకరాల భూమిని పరిశ్రమల అభివృద్ధికి ఉపయోగిస్తామని, కొత్తగూడెంలో ఎయిర్‌పోర్టు నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థి అజ్మీరా సీతారాంనాయక్ మాట్లాడుతూ దేశ సమగ్రతకు, సర్వతోముఖాభివృద్ధికి మోదీని మూడోసారి ప్రధానిని చేయాలని పిలుపునిచ్చారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు రంగాకిరణ్ మాట్లాడుతూ బహిరంగసభకు నలుమూలల నుంచి వేలాదిగా వచ్చిన ప్రజానీకానికి కృతజ్ఞతలు తెలిపారు. కమలం గుర్తుకు ఓటు వేసి బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ బహిరంగసభలో ఇంకా పార్టీ నేతలు ఎం.ధర్మారావు, పొంగులేటి సుధాకర్ రెడ్డి, గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, ఉప్పల శారద, సత్యనారాయణ, విజయరామారావు పాల్గొన్నారు.

స్వతంత్రులూ తక్కువేమీ కాదు!

ఖమ్మం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో ప్రధాన పార్టీలు పెద్ద ఎత్తున మెజారిటీలు పొందాలన్న యోచనలో వ్యూహాలు, ప్రతివ్యూహాలు రచిస్తున్నాయి. గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో గణనీయమైన మెజారిటీలు సాధించిన ఘనత కాంగ్రెస్‌కు ఉండగా, ఈసారి ఆ మెజారిటీలు తగ్గకుండా ఉండేలా ప్రచారాలు నిర్వహిస్తున్నారు. మరోవైపు బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థులు సైతం గతంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో జరిగిన లోటుపాట్లను సరిచేసుకుంటూ, అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలకు పొంతన ఉండదంటూ మెజార్టీ దక్కేలా ప్రచారం సాగిస్తున్నారు. ఈ తరుణంలో ప్రధాన పార్టీల అభ్యర్థులకు ఇండిపెండెంట్ అభ్యర్థుల బెడద మొదలైందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. నామినేషన్ల ఉపసంహరణ అనంతరం ఈసారి ఖమ్మం పార్లమెంటు పరిధిలో 35 మంది అభ్యర్థులు బరిలో ఉండగా.. వారిలో 24మంది స్వతంత్ర అభ్యర్థులు ఉండటం చర్చనీయాంశంగా మారింది. 2014 పార్లమెంటు ఎన్నికల్లో 20మంది స్వతంత్ర అభ్యర్థులు ఉండగా, 2019 ఎన్నికల్లో 13మంది స్వతంత్ర అభ్యర్థులు పోటీ చేశారు. మహబూబాబాద్ పార్లమెంటు పరిధిలో ప్రస్తుతం 23మంది బరిలో నిలవగా, ఆరుగురు స్వతంత్ర అభ్యర్థులు ఉన్నారు. 2014లో 10మంది, 2019లో ఆరుగురు పోటీ చేశారు.

మెజార్టీలపై ప్రభావం

ప్రతీ ఎన్నికల్లోనూ స్వతంత్ర అభ్యర్థుల ఓట్లు కలిపితే ఒక్కో పార్లమెంటు నియోజకవర్గంలో 50వేల వరకు సాధిస్తూ వస్తున్నారు. ఈసారి ఎన్నికల్లో ఖమ్మం పార్లమెంటు పరిధిలో 2019 నాటి ఎన్నికల కంటే ఎక్కువ మంది అభ్యర్థులు పోటీ చేస్తుండటంతో ప్రధాన పార్టీల అభ్యర్థులు సాధించే మెజారిటీల్లో చీలిక ఏర్పడే అవకాశం ఉందన్న అభిప్రాయాలున్నాయి. 2014 ఎన్నికల సమయంలో అప్పటి టీడీపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావుపై వైఎస్ఆర్‌సీపీ తరపున పోటీ చేసిన పొంగులేటి శ్రీనివాసరెడ్డి 12,204 ఓట్ల తేడాతో గెలిచారు. అదే ఎన్నికల్లో మహబూబాబాద్ పార్లమెంటు నియోజకవర్గంలో బీఆర్ఎస్ నుంచి పోటీ చేసిన అజ్మీరా సీతారాంనాయక్‌కు ఆయన సమీప ప్రత్యర్థి బలరాం నాయక్ (కాంగ్రెస్)కు మధ్య వ్యత్యాసం 34,992 ఓట్లు.

2019లో ఖమ్మం పార్లమెంటు నుంచి బీఆర్ఎస్ పార్టీ తరపున పోటీ చేసిన నామా నాగేశ్వరరావు.. తన సమీప ప్రత్యర్థి రేణుకా చౌదరి(కాంగ్రెస్)పై 1,68,062 ఓట్ల మెజారిటీతో గెలిచారు. మహబూబాబాద్ పార్లమెంటు బరిలో బీఆర్ఎస్ నుంచి పోటీ చేసిన మాలోతు కవిత తన సమీప ప్రత్యర్థి బలరాం నాయక్‌పై 1,46,663 ఓట్ల మెజార్టీ సాధించారు. కాగా ప్రస్తుతం జరిగే ఎన్నికల్లో 2019 సీన్ రిపీట్ అయితే ఆయా ప్రధాన పార్టీల మెజార్టీలు తగ్గే అవకాశం ఉంది. ఒకవేళ 2014 సీన్ జరిగితే మాత్రం ఆయా అభ్యర్థుల గెలుపోటములను నిర్ణయించే స్థానంలో ఇండిపెండెంట్ అభ్యర్థులు ఉండనున్నారు.

ఖమ్మం లోక్‌సభ స్థానంలో ఇండిపెండెంట్లు సాధించిన ఓట్లు

నియోజకవర్గం	2014లో	2019లో
ఖమ్మం	4623	4991
పాలేరు	6611	9171
మధిర	3448	5825
వైరా	4098	6569
సత్తుపల్లి	5471	8729
కొత్తగూడెం	15,642	5128
అశ్వారావుపేట	15,557	11,429
మొత్తం	55,450	51,842

మహబూబాబాద్ లోక్‌సభ స్థానంలో ఇండిపెండెంట్లు సాధించిన ఓట్లు

నియోజకవర్గం	2014లో	2019లో
డోర్నకల్	8920	6819
మహబూబాబాద్	10,545	6081
నర్సంపేట	64,446	5425
ములుగు	12075	6312
పినపాక	12008	6601
ఇల్లెందు	31,438	10,092
భద్రాచలం	11,023	4253
మొత్తం	1,50,455	39,583

అభ్యర్థులు ఖర్చులు తెలపాలి

ఖమ్మం కలెక్టరేట్, ఏప్రిల్ 29: ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల ఖర్చు వివరాలను తనిఖీ కోసం కార్యాచరణ చేసినట్లు ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల వ్యయ పరిశీలకులు అభ్యర్థుల వ్యయ వివరాల మొదటి తనిఖీ మే 1 న, రెండో తనిఖీ మే 6న, మూడో తనిఖీ మే 10 న నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆయా తేదీల్లో తనిఖీలు ఉదయం 10.00 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు కలెక్టరేట్ రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో చేపట్టనున్నట్లు తెలిపారు.. అభ్యర్థులు, వారికి సంబందించిన వ్యయ ఏజెంట్లు ఖర్చుల రిజిస్టర్లతో నిర్ధేశించిన తేదీల్లో హాజరుకావాలని కోరారు.

పోట్ల నామినేషన్ వెనక్కు..

» కాంగ్రెస్ పెద్దల హామీతో ఉపసంహరణ

ఖమ్మం, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతిప్రతినిధి): ఖమ్మం లోక్‌సభ స్థానం నుంచి ఖమ్మం టికెట్ ఆశించి స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేసిన మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు సోమవారం తన నామినేషన్ ఉపసంహరించుకున్నారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు పలువురు కాంగ్రెస్ పెద్దలు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నామినేషన్ ఉపసంహరించుకోవాలని పార్టీలో సముచిత స్థానం, గుర్తింపు ఉంటుందని, ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థి విజయానికి కృషిచేయాలని కోరారు. అందుకు అంగీకరించి తన నామినేషన్ ఉపసంహరించుకున్నారు . కాంగ్రెస్ అభ్యర్థి రఘురాంరెడ్డి విజయానికి కృషిచేస్తానని, ప్రచారంలో పాల్గొంటానని పోట్ల నాగేశ్వరరావు ప్రకటించారు.

మైక్రో అబ్జర్వర్ల ర్యాండమైజేషన్ పూర్తి

ఖమ్మం కలెక్టరేట్, ఏప్రిల్ 29: లోక్‌సభ సాధారణ ఎన్నికలకు సంబంధించి ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గంలో అసెంబ్లీ సెగ్మెంట్ల వారిగా మైక్రో అబ్జర్వర్స్ ర్యాండమైజేషన్‌ను సాధారణ పరిశీలకులు డాక్టర్. సంజయ్ జి కోల్టే, ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్ సోమవారం చేపట్టారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో మైక్రో అబ్జర్వర్స్ ర్యాండమైజేషన్ నిర్వహించారు. 207 మంది మైక్రో అబ్జర్వర్లను అసెంబ్లీ సెగ్మెంట్ల వారిగా కేటాయింపు చేశారు. ఈ కార్యక్రమంలో ఎల్డీఎం శ్రీనివాసరెడ్డి, కలెక్టరేట్ ఏవో అరుణ, ఎన్ఐసీ కోఆర్డినేటర్ రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ప్రక్రియను పరిశీలిస్తున్న అధికారులు

కొత్తగూడెంలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా సభ దృశ్యాలు



బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాకు స్వాగతం పలుకుతున్న బీజేపీ నాయకులు



కొత్తగూడెంలో సింగరేణి టోపీని ధరించి అభివాదం చేస్తున్న బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డా, నాయకులు



సభలో మాట్లాడుతున్న ఎంపీ లక్ష్మణ్



మాట్లాడుతున్న కామారెడ్డి ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి

ఖమ్మంలో మాజీ సీఎం కేసీఆర్ రోడ్డు షో దృశ్యాలు



ప్రజలకు అభివాదం చేస్తున్న మాజీ సీఎం కేసీఆర్, నామా





మాజీ సీఎం కేసీఆర్ సభలో బీఆర్ఎస్ కార్యకర్తల సంబురాలు



హాజరైన బీఆర్ఎస్ శ్రేణులు

సాగు-బాగు ప్రాజెక్టు అధ్యయనంపై
ఝార్ఖండ్ వ్యవసాయశాఖ అధికారుల పరిశీలన



కలెక్టర్ గౌతమ్‌ను కలిసిన ఝార్ఖండ్ రాష్ట్ర వ్యవసాయ ఉద్యానశాఖ డైరెక్టర్ కుమార్ తారాచంద్

ఖమ్మం కలెక్టరేట్, ఏప్రిల్ 29: ఝార్ఖండ్ రాష్ట్ర వ్యవసాయ, ఉద్యానవన శాఖల డైరెక్టర్ కుమార్ తారాచంద్ నేతృత్వంలోని బృందం తెలంగాణ రాష్ట్రంలో సాగు-బాగు ప్రాజెక్ట్ అధ్యయనం కోసం పర్యటించారు. పర్యటనలో భాగంగా సోమవారం ఖమ్మం జిల్లాకు చేరుకున్న బృందం జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్‌ను కలెక్టరేట్‌లో కలిశారు. ఈ సందర్భంగా వ్యవసాయ, ఉద్యానవన రంగంలో చేపడుతున్న చర్యలు, సాగు-బాగు ప్రాజెక్ట్ అమలు గురించి బృందానికి కలెక్టర్ వివరించారు. ఈ కార్యక్రమంలో బృందంలోని అధికారులు ఝార్ఖండ్ రాష్ట్ర ప్రత్యేక కార్యదర్శి, సలహాదారు ప్రదీప్ కుమార్ హజారే, ఝార్ఖండ్ రాష్ట్ర కార్యదర్శి ఓ.ఎస్.డి. అభినవ్ మిశ్రా, ఖమ్మం జిల్లా వ్యవసాయ అధికారి విజయ నిర్మల, డిజిటల్ గ్రిన్ ప్రాజెక్ట్ మేనేజర్లు జ్యోతి, యశోద, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలు

ఖమ్మం స్పోర్ట్స్, ఏప్రిల్ 29: నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో జరుగుతున్న రాయల నారాయణరావు మెమోరియల్ రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలు సోమవారం ముగిశాయి. టోర్నీలో ఓవరాల్ ఛాంపియన్‌గా ఖమ్మం జట్టు నిలిచింది. పోటీల చివరి రోజు అండర్-10, 11, 13, 15, 17, 19 బాలుర, బాలికల విభాగాల్లో పోటీలు నిర్వహించారు.రెండు రోజుల పాటు నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. కార్యక్రమంలో జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడు బాలసాని విజయ్‌కుమార్, సెక్రటరీ ఓలేటి సాంబమూర్తి, సంఘ బాధ్యులు డాక్టర్లు కూరపాటి ప్రదీప్‌కుమార్, ప్రవీణ్, సుమంత్, జంగా కార్తిక్, కొండా శ్రీధర్, రాయల సతీష్‌బాబు, భరణి, అఫ్జల్ హసన్, సంపెట ఉపేందర్, మున్నా పాల్గొన్నారు.



ఓవరాల్ ఛాంపియన్‌షిప్ సాధించిన ఖమ్మం జట్టు

ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన మౌలిక వసతులు

● రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కమిషనర్

తిరుమలాయపాలెం, ఏప్రిల్ 29: రాష్ట్రంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్యసేవలందిస్తున్నట్లు రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్ తెలిపారు. సోమవారం తిరుమలాయపాలెంలోని వైద్య విధాన ఆసుపత్రిలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని వైద్యవిధాన పరిషత్ ఆసుపత్రుల్లోని సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అలాగే ఆయా ఆసుపత్రుల్లో ఖాళీగా ఉన్న పోస్టులను అడిగి తెలుసుకున్నారు. ఈకార్యక్రమంలో జిల్లా మెడికల్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, టీఎస్ఎంఐసీ ఉమామహేశ్వరరావు, మెడికల్ సూపరింటెండెంట్లు రవికుమార్, వెంకటేశ్వర్లు, రంజిత్,లవణ్, మంగళ, కృపాఉషశ్రీ, వైద్యాధికారి బొల్లికొండ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

న్యాయమూర్తిగా సూరిరెడ్డి బాధ్యతల స్వీకరణ



న్యాయమూర్తులైన సూరిరెడ్డి, వెంకటేశ్వర్లును సన్మానిస్తున్న న్యాయవాదులు

మణుగూరుటౌన్, ఏప్రిల్29: మణుగూరు ప్రథమ శ్రేణి జ్యుడిషియల్ న్యాయమూర్తిగా భద్రాచలం కోర్టు నుంచి బదిలీపై వచ్చిన న్యాయమూర్తి సూరిరెడ్డి కంభంపాటి సోమవారం బాధ్యతలను స్వీకరించారు. మణుగూరు కోర్టు నుంచి భద్రాచలం కోర్టుకు బదిలీ వెళ్తున్న న్యాయమూర్తి మీసాల వెంకటేశ్వర్లు బదిలీపై వచ్చిన సూరిరెడ్డికి బాధ్యతలను అప్పగించారు. ఈ సందర్భంగా మణుగూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయమూర్తుల ఇద్దరిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో న్యాయవాదులు కవిత, విజయరావు, కందిమళ్ల నర్సింహారావు, విజయలక్ష్మి, శైలజ, పద్మావతి, మేదరమెట్ల శ్రీనివాస్‌రావు, సాంబ, నాగార్జునరెడ్డి, పోశం భాస్కర్‌రావు, రుద్ర వెంకట్, మధుసూదన్, సర్వేశ్వరరావు, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల అత్యుత్సాహం

- ఈనెల 11న రీడింగ్ నమోదు
- బిల్లు చెల్లించలేదని 29న విద్యుత్ కనెక్షన్ తొలగింపు

ఖమ్మం సంక్షేమవిభాగం, ఏప్రిల్ 29: కనీసం గడువు ముగియకముందే విద్యుత్ బిల్లులు చెల్లించలేదని విద్యుత్ ఉద్యోగులు విద్యుత్ కనెక్షన్లు కట్ చేసిన సంఘటన ఖమ్మం నగరంలో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. నేహ్రూనగర్‌లోని విద్యుత్ మీటరు నెంబర్ 02114-28917 ను ఈనెల 11న రీడింగ్ నమోదు చేశారు. పాత బకాయిలు కూడా లేకపోవడంతో రూ.3,012 విద్యుత్ బిల్లు వచ్చింది. సోమవారం ఆ ఇంటి యజమానులు బయటకు వెళ్లిన సమయంలో విద్యుత్‌శాఖ ఉద్యోగులు వచ్చి బిల్లు చెల్లించలేదని సమీపంలో ఉన్న నివాసాల వారికి చెప్పి విద్యుత్ కనెక్షన్‌ను తొలగించారు. కొంత సేపటికి ఇంటికి వచ్చిన యజమాని విద్యుత్ కనెక్షన్ తొలగించడంపై తీవ్ర ఆందోళనకు గురయ్యారు. సమస్యను విద్యుత్‌శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయంపై ఖమ్మం డీఈ బాబురావును వివరణ కోరగా నెల రోజులు లోపుగా విద్యుత్ బకాయిలు ఉన్నాయంటూ కనెక్షన్ తొలగించడంపై సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకుంటామన్నారు.

32 కేజీల గంజాయి పట్టివేత

ఖమ్మంక్రైం, ఏప్రిల్ 29: 32 కేజీల గంజాయిని ఖమ్మం రైల్వే స్టేషన్‌లో పోలీసులు పట్టుకున్నారు. సోమవారం సీఐ ఉదయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్‌కు చెందిన సంజయ్‌సింగ్‌కు 32 కేజీల గంజాయి అప్పగించేందుకు ఒడిస్సా రాష్ట్రం గజపతి జిల్లా భోమిక గ్రామానికి చెందిన భరత్, పద్మతుల అనే వ్యక్తులు విశాఖలో 32 కేజీల గంజాయి తీసుకుని రైలులో సికంద్రాబాద్‌కు బయలుదేరారు. ఎవరికి అనుమానం రాకుండా వారు ఖమ్మం రైల్వే స్టేషన్‌లో దిగి మరో రైలు ద్వారా సికింద్రాబాద్ వెళ్లేందుకు రైల్వేస్టేషన్ బయట ఉన్నారు. విధుల్లో ఉన్న వన్‌టౌన్ పోలీసులకు అనుమానం రావడంతో వారి వద్ద ఉన్న బ్యాగ్‌లను తనిఖీ చేయగా అందులో గంజాయి ప్యాకెట్లు లభించాయి. వారి వద్ద నుంచి రూ.8లక్షల విలువ చేసే 32కేజీల గంజాయిని, రూ.5వేల నగదు స్వాధీనం చేసుకుని వారిని రిమాండ్ చేసినట్టు సీఐ తెలిపారు.



స్వాధీనం చేసుకున్న గంజాయిని చూపుతున్న పోలీసులు

పాఠశాలల్లో సౌకర్యాలు సమకూర్చాలి

● ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్



సమావేశంలో మాట్లాడుతున్న పీవో ప్రతీక్‌జైన్

భద్రాచలం, ఏప్రిల్ 29: గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడపబడుతున్న ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలు తిరిగి పాఠశాలలు ప్రారంభమయ్యే నాటికి విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు సమకూరేలా సంబంధిత ప్రత్యేక అధికారులు బాధ్యత తీసుకోవాలని ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్ అన్నారు. సోమవారం ఐటీడీఏ కాన్ఫరెన్స్ హాల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ప్రత్యేకాధికారులతో పాఠశాలలో మౌలిక వసతులు కల్పించడానికి తీసుకోవలసిన కార్యాచరణపై నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. పాఠశాలలు ప్రారంభించే నాటికి పాఠశాలల్లో ఏమైనా మరమ్మతులుంటే వెంటనే పనులు ప్రారంభించాలని సూచించారు. విద్యార్థులు వేసవి సెలవుల్లో వారి ఊర్లకు వెళ్లి అక్కడ వాతావరణానికి అలవాటుపడిపోయి తిరిగి పాఠశాలలు తెరవగానే పాఠశాలలకు వచ్చే నాటికి ప్రతి ఆశ్రమ పాఠశాల, వస తి గృహాలు సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలన్నా రు. విద్యార్థులు నిద్రించే రూముల్లో నాలుగు బెడ్లకు కలిపి ఒక ఫ్యాను తప్పనిసరిగా ఉండాలన్నారు. మరుగుదొడ్లకు మరమ్మతులు చేయించి శుభ్రంగా ఉండేలా చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి డేవిడ్‌రాజు, డీడీ మణెమ్మ, ఈఈ తానాజీ, ఎస్వో సురేష్‌బాబు, ఏసీఎంవో రమణయ్య, ఏటీడీవో నరసింహారావు, డీటీఆర్‌వోఎఫ్ఆర్ శ్రీనివాస్, ఏడీ అగ్రికల్చర్ భాస్కరన్ పాల్గొన్నారు.

అర్థమయ్యేలా పాఠాలు బోధించాలి

విద్యార్థులకు అర్థమయ్యేలా పాఠాలు బోధించాలని ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్ అన్నారు. సోమవారం ఐటీడీఏ కాన్ఫరెన్స్ హాల్లో ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులు బోధిస్తున్న లెక్చరర్ల డెమోను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని భద్రాచలం, కిన్నెరసాని, దమ్మపేట, ఖమ్మంలోని సీవోఈ కళాశాలలో ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టు లెక్చరర్లు గిరిజన విద్యార్థులకు సక్రమమైన పద్ధతిలో సబ్జెక్టులు బోధించి విద్యార్థులను నిష్ణాతులుగా తీర్చిదిద్ది మంచి ర్యాంకులు తీసుకురావడానికి ఈ టెస్టులు నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి డేవిడ్‌రాజు, డీడీ మణెమ్మ, గురుకులం ఏవో నరేందర్, 15 మంది ఫ్యాకల్టీలు పాల్గొన్నారు.

అనారోగ్యంతో శతాధిక వృద్ధుడు మృతి



లక్ష్మయ్య

కరకగూడెం, ఏప్రిల్ 29: అనారోగ్యంతో శతాధిక వృద్ధుడు మృతి చెందిన సంఘటన మండలంలోని వెంకటాపురంలో జరిగింది. వెంకటాపురం గ్రామానికి చెందిన కొమరం లక్ష్మయ్య (101) అనే వృద్ధుడు అనారోగ్యంతో సోమవారం మృతి చెందాడు.

చికిత్స పొందుతూ వ్యక్తి ..



శ్రీనివాసరావు

దమ్మపేట, ఏప్రిల్ 29: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందతూ వ్యక్తి మృతి చెందిన ఘటన సోమవారం జరిగింది. మృతుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 26న మొద్దులగూడెం గ్రామానికి చెందిన దొడ్డా శ్రీనివాసరావు (50), చీమల శ్రీను ఇద్దరు కలసి ద్విచక్ర వాహనంపై సత్తుపల్లి వెళ్లి తిరిగి వస్తుండగా గున్నేపల్లి గ్రామ సమీపంలో ప్రమాదవశాత్తూ వాహనంపై నుంచి రోడ్డుపై పడటంతో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం క్షతగాత్రులను ఖమ్మం వైద్యశాలకు తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శ్రీనివాసరావు సోమవారం మృతి చెందాడు. మృతుడి సోదరుడు శ్రీరామమూర్తి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి...



గోపాల్

దుమ్ముగూడెం, ఏప్రిల్ 29: చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని పెదార్లగూడెంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పెదార్లగూడెం గ్రామానికి చెందిన మర్మం గోపాల్(40) గ్రామస్థులతో కలిసి ఆదివారం కొంగవాగు చెరువుకు చేపల వేట కోసం వెళ్లాడు. గోపాల్‌కు ఈత రాకపోవడంతో నీటిలో మునిగి చనిపోయాడు. గమనించిన తోటి గ్రామస్థులు చెరువులో గాలించిన అచూకీ లభించలేదు. సోమవారం మృతదేహం నీటిపై తేలింది. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

అనుమానాస్పదంగా ఒకరు..

ఎర్రుపాలెం, ఏప్రిల్ 29: అనుమానాస్పదంగా వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలో ఇనగాలి గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన వేల్పుల నాగరాజు (45) శనివారం ఉదయం ఇంటి నుంచి బయలదేరి వెళ్లి ఏపీలోని పెనుగొలను గ్రామం సమీపంలో గల ఓ సుబాబాల్ తోటలో మృతి చెందినట్లు తెలిసింది. మృతిడి బంధువుల నుంచి ఎటువంటి ఫిర్యాదు రాలేదని పోలీసులు చెప్తున్నారు. అనుమానాస్పద మృతికి కారణం తెలియాల్సి ఉంది.

రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు..

అశ్వాపురం, ఏప్రిల్ 29: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందగా, మరోకరికి తీవ్ర గాయాలైన సంఘటన మండల కేంద్రంలోని అశ్వాపురంలో చోటు చేసుకుంది. మండల కేంద్రంలోని హెవీ వాటర్ ప్లాంట్ పని చేస్తున్న సలిగంజి వెంకటేశ్వర్లు(54) ఆదివారం విధులు ముగించుకొని నడుచుకుంటూ ఇంటికి వెళ్తుండగా, గౌతమినగర్ కాలనీ వద్ద మరో ప్లాంట్ ఉద్యోగి అతడిని ద్వి చక్ర వాహనంతో ఢీకొట్టడంతో ఇరువురు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను చి కిత్స నిమిత్తం భారజల ఆస్పత్రికి తరలించారు. వెంకటేశ్వ ర్లు పరిస్థితి విషమంగా ఉండడంతో ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడి భార్య నాగమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇల్లెందు: రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పాత సర్పాపురం గ్రామానికి చెందిన ఈసం కృష్ణ (56) విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. తీవ్రంగా గాయపడిన అతడిని వైద్య చికిత్స నిమిత్తం కొత్తగూడెం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుక్కల దాడిలో చుక్కల దుప్పి మృతి



మృతి చెందిన చుక్కల దుప్పిని పరిశీలిస్తున్న అధికారులు

పినపాక, ఏప్రిల్ 29: కుక్కలు దాడిలో చుక్కల దుప్పి మృతి చెందిన ఘటన సోమవారం మండలంలోని తోగ్గూడెం సమీప అటవీ ప్రాంతంలో చోటు చేసుకుంది. స్థానికులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. తోగ్గూడెం పోట్లపల్లి గుట్ట అటవీ ప్రాంతం నుంచి ఓ దుప్పిని ఊరకుక్కలు తొగ్గూడె గ్రామ సమీపంలోకి తరుముకుంటూ వచ్చాయి. గమనించిన బొడ్డు సరోజిని అనే మహిళ కుక్కలను చెదరగొట్టి, అటవీశాఖాధికారులకు సమాచారం అందించింది. సమాచారం అందుకున్న ఏడూళ్లబయ్యారం బీట్ ఆఫీసర్ లక్ష్మణ్ రావు ఘటనాస్థలానికి చేరుకుని, పరిశీలించారు. తీవ్ర గాయాలపాలైన దుప్పి మృతి చెందిందని అధికారులు తెలిపారు.

రూ.లక్షన్నర నగదు సీజ్

ఇల్లెందురూరల్, ఏప్రిల్29: మండలంలోని లలితాపురం చెక్‌పోస్టు వద్ద ఆదివారం రాత్రి ఎన్నికల అధికారులు రూ.లక్షన్నర నగదును సీజ్ చేశారు. మండలంలోని ఇందిరానగర్ చెందిన నాగరాజు అనే వ్యక్తి ఖమ్మం నుంచి కారులో ఇల్లెందుకు వస్తుండగా లలితాపురం చెక్‌పోస్టు వద్ద ఎన్నికల అధికారి, ఫ్లైయింగ్ స్క్వాడ్ కుమారస్వామి అతడి నుంచి రూ.లక్షన్నర నగదును గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ నగదుకు సంబంధించి ఆధారాలు చూపించకపోవడంతో నగదును సీజ్ చేసి ఎన్నికల అధికారులు అప్పగించారు.

ఛత్తీస్‌గఢ్‌లో ఎదురుకాల్పులు

- మావోయిస్టు మృతి
- దంతెవాడ జిల్లాలో 23మంది లొంగుబాటు

చర్ల, ఏప్రిల్ 29: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుకుమా జిల్లా సలాతోంగ్ అడవుల్లో సోమవారం ఉదయం బలగాలు, మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురు కాల్పుల్లో ఒక మావోయిస్టు మృతి చెందాడు. మావోయిస్టుల కదలికల నేపథ్యంలో డీఆర్‌జీ బలగాలు సుకుమా జిల్లా అడవుల్లో కూబింగ్ చేపట్టాయి. ఇదే క్రమంలో సలాతోంగ్ అడవుల్లోకి బలగాలు చేరుకోగానే ఎదురు కాల్పులు జరిగాయి. సుమారు గంట పాటు కాల్పులు జరిగిన అనంతరం బలగాలు పరిసరాలను పరిశీలించగా ఒక మావోయిస్టు మృత దేహం లభ్యమైనట్లు సుకుమా పోలీసులు తెలిపారు. తప్పించుకున్న మావోయిస్టుల కోసం బలగాలు గాలింపు ముమ్మరం చేశాయి.

ఛత్తీస్‌గఢలోని దంతెవాడ జిల్లాలో సోమవారం జిల్లా పోలీసుల ఎదుట 23 మంది మావోయిస్టులు లొంగిపోయారు. లొంగిపోయినవారు భైరంగడ్ మావోయిస్టు పార్టీకి చెందిన సభ్యులుగా పోలీసులు చెబుతున్నారు. రోడ్లు తవ్వడం, బ్యానర్లు కట్టడం, చెట్లు నరకడం వంటి ఘటనల్లో వీరు పాల్గొన్నట్లుగా పోలీసులు తెలిపారు. పోలీసులు తీసుకొచ్చిన లాల్ వర్రాట్ (కం బ్యాక్ హోమ్) కార్యక్రమానికి ఆకర్షితులై మావోయిస్టులు లొగిపోయినట్లు పోలీసులు చెబుతున్నారు. ఇప్పటి వరకు 761మంది మావోయిస్టు లొంగిపోయారని, లొంగుబాటు ప్రక్రియలో డీఆర్‌జీ, సీఆర్‌పిఎఫ్ బలగాల ప్రోత్సాహం అధికంగా ఉందని దంతెవాడ జిల్లా పోలీసులు పేర్కొంటున్నారు.

వేర్వేరు చోట్ల సుబాబుల్, జామాయిల్ పంటల దగ్ధం

సత్తుపల్లిలో జామాయిల్ ...

సత్తుపల్లిరూరల్, ఏప్రిల్29: సత్తుపల్లి పట్టణంలోని సింగరేణి క్వార్టర్స్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తులు కాల్చిన సిగరేట్ చెట్లలో పడవేయడంతో నిప్పు అంటుకోగా సుమారు 20హెక్టార్ల విస్తీర్ణంలో విస్తరించిన జామాయిల్ ప్లాంటేషన్ దగ్ధమైనట్లు అటవీ అధికారులు తెలిపారు. చెట్ల కింద నేలపై ఉన్న ఎండుటాకులు మాత్రమే దగ్ధమయ్యాయని, ప్రాణహాని, ఆస్తినష్టం వాటిల్లలేదని రేంజర్ స్నేహలత తెలిపారు.

మల్లారంలో 15ఎకరాల్లో సుబాబుల్, జామాయిల్...

ముదిగొండ, ఏప్రిల్ 29: రైతులు చెత్తకు నిప్పుపెట్టడంతో మండలంలోని మల్లారం గ్రామంలో ఆదివారం అర్థరాత్రి వేదాల వెంకటేశ్వరరావు, కొత్తా జ్యోతి, కోలేటి నాగేశ్వరరావులకు చెందిన 15 ఎకరాల సుబాబుల్, జామాయిల్ పంటలు దగ్ధమయ్యాయి. సుమారు రూ.10నుంచి రూ.15లక్షల మేర నష్టం వాటిల్లినట్లు బాధిత రైతులు తెలిపారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

మండాలపాడులో నాలుగు ఇళ్లు ...

పెనుబల్లి, ఏప్రిల్ 29: విద్యుదాఘాతంతో మండాలపాడు గ్రామంలో గాయం జగన్నాథం ఇల్లు పూర్తిగా దగ్ధం అయ్యింది. ఇంట్లో ఉన్న నగదు, దుస్తులు, బంగారం పూర్తిగా దగ్ధమయ్యాయి. మంటలు పక్కనే ఉన్న గాయం కృష్ణయ్య పూరిల్లు, సంకుల వెంకయ్యకు చెందిన గడ్డివాము, పూరిల్లు, సంకుల పుల్లయ్యకు చెందిన గడ్డివాములకు అంటుకొని దగ్ధమయ్యాయి. సత్తుపల్లి నుంచి ఫైరింజన్ సిబ్బంది మంటలను అదుపు చేశారు.

గుండెపూడిలో పల్లెప్రకృతివనం...

జూలూరుపాడు, ఏప్రిల్29: గుండెపూడి పల్లె ప్రకృతి వనం సమీపంలో ఉన్న స్మశాన వాటికలో గ్రామంలోని ఓ వ్యక్తి మృతి చెందడంతో దహన సంస్కారాలు నిర్వహించారు. ఈ క్రమంలో మంటలు వ్యాపించి పల్లెప్రకృతి వనంలోని 3వేల విలువైన మొక్కలు కాలిపోయాయి. అదేవిధంగా పల్లె ప్రకృతి వనం పక్కన నర్సరీలో పెంచుతున్న వాటిలో 300 మొక్కలు దగ్ధమయ్యాయి.



సత్తుపల్లిలో మంటలార్పుతున్న అటవీ సిబ్బంది

వన్యప్రాణి వేటగాడిపై కేసు నమోదు

- వేటగాడి నుంచి 2కేజీల కనుజు మాంసం స్వాధీనం

ఎర్రుపాలెం, ఏప్రిల్ 29: మండలంలోని కాచవరం గ్రామంలో ఓ వన్యప్రాణి వేటగాడిని అదుపులోకి తీసుకున్నట్లు జిల్లా అటవీ అధికారి విక్రమ్‌సింగ్ సోమవారం తెలిపారు. సోమవారం కేసు వివరాలను వెల్లడించారు. వన్యప్రాణులను వేటాడుతున్నారన్న సమాచారంతో భీమవరం రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతంలో నర్సింహాపురం అటవీ సెక్షన్‌లోని కాచవరం గ్రామానికి చెందిన మర్తా శ్రీను ఇంటిపై ఆదివారం ఫారెస్ట్ రేంజ్ అధికారి విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఆకస్మిక తనిఖీ నిర్వహించగా, ఇంటిలో వంట కోసం సిద్ధం చేసిన 2కేజీల కనుజు మాంసం లభ్యమయ్యిందని పేర్కొన్నారు. మాంసంతోపాటు నేరస్తుడు ఉపయోగించిన వలలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. నిందితుడి పై కేసు నమోదు చేసి న్యాయమూర్తి ముందు హాజరుపర్చనున్నట్లు మధిరలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ సెక్షన్ అధికారి ఎస్.కొండారెడ్డి, నర్సింహాపురం ఫారెస్ట్ బీట్ అధికారి పి.శ్రీనివాసరావు, కాచవరం రేంజ్ సిబ్బంది, ప్రొటెక్షన్ వాచర్స్ పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న జిల్లా అటవీ అధికారి విక్రమ్‌సింగ్

ఘనంగా టీజేఏస్ ఆవిర్భావ వేడుకలు


టీజేఏస్ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

అశ్వాపురం ఏప్రిల్ 29: తెలంగాణ జనసమితి (టీజేఎస్) ఆవిర్భావ వేడుకలను మండల టిజేఏస్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. మండల పరిధిలోని మొండికుంట గ్రామంలో జరిగిన టిజేఏస్ ఆవిర్భావ వేడుకల్లో టిజేఏస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పగడాల కరుణాకర్‌రెడ్డి పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ సారథిగా రాష్ట్రం సాధించిన తర్వాత జరిగిన పరిణామాల్లో సామాజిక న్యాయంకోసం ప్రొఫెసర్ కోదండరాం నేతృత్వంలో టిజేఏస్ ఉద్భవించిందన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సురకంటి ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాస్ ,మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేశ సమైక్యతను దెబ్బతీసే
బీజేపీని ఓడించాలి

● సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు వెంకట్



మాట్లాడుతున్న వెంకట్

భద్రాచలం, ఏప్రిల్ 29: దేశ సమైక్యతను, సమగ్రతను దెబ్బతీసే మతోన్మాద బీజేపీని, దాని మిత్రపక్షాలను పార్లమెంటు ఎన్నికల్లో ఓడించాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు బి.వెంకట్ పిలుపునిచ్చారు. భద్రాచలంలో సోమవారం జరిగిన సీపీఎం పట్టణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ రంగాన్ని పరిరక్షించుకోవాలన్నా, వ్యవసాయ రంగం కార్పోరేటీకరణ కాకుండా ఉండాలన్నా, నిరుద్యోగం తగ్గాలన్నా ప్రజల్లో కొనుగోలు శక్తి పెరగాలన్నా సీపీఎం మద్దతు ఇచ్చే కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చా వెంకటేశ్వర్లు, గడ్డం స్వామి, వై.వెంకటరామారావు, పి.సంతోష్‌కుమార్, డి.సీతాలక్ష్మి, యు.జ్యోతి, ఎస్.నాగరాజు, కుంజా శ్రీనివాస్, ఎసడ్డి ఫిరోజ్, ఎస్.భూపేంద్ర పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థి గెలుపే ధ్యేయంగా పనిచేయాలి

- పొంగులేటి సతీమణి మాధురిరెడ్డి
- దమ్మపేట, అశ్వారావుపేటలో రఘురాంరెడ్డి తరుపున ఎన్నికల ప్రచారం


మాట్లాడుతున్న మాధురిరెడ్డి

దమ్మపేట/ అశ్వారావుపేట ఏప్రిల్ 29: కాంగ్రెస్ పార్టీ ఖమ్మం ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న రామసహాయం రఘురాంరెడ్డిని ఆశీర్వదించి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని రెవెన్యూశాఖామంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సతీమణి మాధురిరెడ్డి ఓటర్లను అభ్యర్థించారు. అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణతో కలిసి సోమవారం రాత్రి దమ్మపేట మండలంలోని పార్కలగండి, కొత్తూరు, అంకంపాలెం, సుధాపల్లి, పట్వారిగూడెం, గండుగులపల్లి గ్రామాలతో పాటు అశ్వారావుపేటలో ఓటర్లను అభ్యర్థిస్తూ వ్యాపార దుకాణాలు, ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. రోడ్‌లో ఆమె మాట్లాడుతు గత శాసనసభ ఎన్నికల్లో అశ్వారావుపేట ఎమ్మెల్యేగా జారే ఆదినారాయణ గెలుపు కాంక్షిస్తూ ప్రచారం నిర్వహించానని ఆమేరకు జారే ఆదినారాయణనను రాష్ట్రంలో మొదటి గెలుపు అశ్వారావుపేట నియోజక వర్గ ప్రజలు ఎన్నడు లేని విధంగా అధిక మెజారిటితో అందించనందుకు కృతజ్ఞతలు తెలిపారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చుతుందని ప్రస్తుతం పూర్తి కాని హామీలన్ని ఎన్నికల అనంతరం నెరవేర్చేందుకు కృషి చేస్తుందన్నారు. ఈసందర్భంగా ఖమ్మం కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా పోటి చేస్తున్న రఘురాంరెడ్డిని పరిచయం చేశారు. ఈజిల్లాలో ముగ్గురు మంత్రులు ఖమ్మం ప్రజలందరికి అండగా వుంటారని ఎన్నడు జరగని అభివృద్ధి ఈ జిల్లా ప్రజలు చూస్తారని వారికి తోడుగా ఎంపీగా అభ్యర్థిగా రఘురాంరెడ్డిని గెలిపిస్తే ప్రజలకు మరింత అండగా వుంటారన్నారు. అంతకు ముందు ఎమ్మెల్యే జారే మాట్లాడుతూ అశ్వారావుపేట నియోజకవర్గం ప్రజలు తనను ఆదరించిన విధంగానే రఘురాంరెడ్డి గెలిపించేందుకు చేతిగుర్తుపై ఓటు వేసి ఆశీర్వ దించాలన్నారు. తనకు ఇచ్చిన మెజారిటి కంటే రెట్టింపు మెజారిటి ఇవ్వాలని ఆకాంక్షించారు. దీనికి కాంగ్రెస్ కార్యకర్తలు మరింత కష్టపడితేనే తాను ఇచ్చిన హామీ నెరవేరుతుందని అన్నారు. తాను ప్రజలకు అందుబాటులోఎలా వున్నానో నియోజకవర్గ ప్రజలందరికి తెలుసన్నారు. ప్రజల కష్టాలు, సుఖాలు, సమస్యలు తెలిసివాడనని తాను మీలో ఒకడిగా సమస్యల నుండి వచ్చిన వాడిగా మీసమస్యలు నెరవేర్చేందుకు తాను ప్రణాళికాబద్ధంగా పని చేస్తున్నానని జారే అన్నారు. అశ్వారావుపేట నియోజక వర్గంలో ఎంపీ అభ్యర్థికి అధిక మెజారిటి ఇచ్చి మరొకసారి అశ్వారావు నియోజకవర్గ సత్తాచాటాలన్నారు. ఈ కార్యక్రమంలో కొయ్యల అచ్యుతరావు, ఎంపీపి సోయం ప్రసాదు, ఎల్లిన రాఘవరావు, ఎల్లిన మురళి, ఎర్రా వసంత రావు, కేవి సత్యనారాయణ, కాసాని నాగప్రసాదు, కోటగిరి సత్యంబాబు, రావు గంగాధరరావు, కొర్సా సాగర్, చిన్నంశెట్టి యుంగదర్, పగడాల రాంబాబు, రావు రవిశంకర్, పర్వతనేని ప్రసాదు, చక్రాల మల్లేశ్వరరావు, సుంకవల్లి వీరభద్రరావు, తుమ్మా రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

రేపు కొత్తగూడెంలక్ష పొంగులేటి రోడ్‌షో

చుంచుపల్లి: కాంగ్రెస్ ఖమ్మం ఎంపీ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి గెలుపే ధ్యేయంగా ప్రతి ఒక్కరు సైనికుల్లా పని చేయాలని జిల్లా కాంగ్రెస్ నాయకుడు ఆళ్ల మురళి కోరారు. సోమవారం విద్యానగర్‌లోని పొంగులేటి క్యాంప్ కార్యాలయంలో కొత్తగూడెం ఎన్నికల సమన్వయ కర్త తుళ్ళూరు బ్రహ్మయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల, నాయకుల సమావేశంలో సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీకి మద్దతు ప్రకటించిన సీపీఐ, సీపీఎం, టిజేఎస్ ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తల సమన్వయంతో పని చేసి కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలో అత్యధిక మెజారిటీ అందించాలన్నారు. బుధవారం సాయంత్రం ఐదు గంటలకి కొత్తగూడెంలో ఈ రోడ్ షో లో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పాల్గొంటారన్నారు. సమావేశంలో జడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర రావు, ఉమ్మడి ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు తోటా దేవి ప్రసన్న, టీపీసీసీ సభ్యుడు నాగ సీతారాములు, సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషాపాల్గొన్నారు.

సింగరేణి జీఎం(పర్సనల్)గా
సామ్యూల్ సుధాకర్


సామ్యూల్ సుధాకర్

రుద్రంపూర్, (సింగరేణి) ఏప్రిల్ 29: సింగరేణి జనరల్ మేనేజరు (పర్సనల్ అండ్ వెల్ఫేర్)గా పిల్లి సామ్యూ ల్ సుధాకర్‌ను నియమిస్తూ సింగరేణి యాజమాన్యం సోమవారం ఉత్తర్వులను జారీ చేసింది. జనరల్ మేనేజరు పర్సనల్‌గా పని చేస్తున్న బసవయ్య పర్సనల్ వెల్ఫేర్‌గా పని చేస్తున్న కే. బసవయ్య మంగళవారం పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో నూతన నియామకానికి యాజమాన్యం చర్యలు చేపట్టింది. సింగరేణి సూపర్ బజారు మేనేజింగ్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న సామ్యూల్ సుధాకర్‌కు జనరల్ మేనేజరు పర్సనల్‌గా అదనపు బాధ్యతలను అప్పగించారు. గత ఐదు సంవత్సరాలుగా బసవయ్య జీఎంగా కొనసాగారు.

బాలిక వివాహంపై విచారణ

దుమ్ముగూడెం ఏప్రిల్ 29: మండల పరిధి లక్ష్మీనగరానికి చెందిన బాలిక పెళ్లి వ్యవహారంపై ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సహనా సోమవారం క్షేత్రస్థాయిలో విచారణ జరిపారు. ఈనెల 28న ఖమ్మం జిల్లా నేలకొండపల్లిలో బాలికకు వివాహం జరిగిన విషయం తెలిసిందే. బాలిక మేజర్ అయ్యే వరకూ కాపురానికి పంపేదిలేదని బాలిక బంధువులు ఒప్పంద పత్రం రాసిచ్చారు. బాలిక తల్లి ఆరోగ్యం బాగాలేకపోవడంతో పెళ్లి చేయాల్సి వచ్చిందని గ్రామపెద్దలు వాంగ్మూలమిచ్చారు.

బీజేపీ విజయం కోసం సైనికుల్లా పని చేయాలి

● ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జ్ రుక్మారావు


మాట్లాడుతున్న రుక్మారావు

జూలూరుపాడు, ఏప్రిల్ 20: పార్లమెంట్ ఎన్నికల్లో ఖమ్మం బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోదరావు గెలుపునకు నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని బీజేపీ పార్లమెంట్ వైరా నియోజకవర్గ ఇన్‌చార్జ్ రుక్మారావు పిలుపునిచ్చారు. బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోదరావు గెలుపును కాంక్షిస్తూ సోమవారం కొత్తగూడెంలో జరిగిన బీజేపీ జాతీయ అధ్యక్షులు జేపీ. నడ్డా సభకు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన బీజేపీ శ్రేణులు అధికసంఖ్యలో తరలివెళ్లారు. కొమ్ముగూడెంలో ర్యాలీని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో కిసాన్‌మోర్చా రాష్ట్ర కార్యదర్శి చిలుకూరి రమేష్, పార్టీ వైరా నియోజకవర్గ ఇంచార్జీ నెల్లూరి కోటేశ్వరరావు, జిల్లా నాయకులు మాదినేని సతీష్, నున్నా రమేష్, బీజేపీ మండల అధ్యక్షులు సిరిపురపు ప్రసాద్ పాల్గొన్నారు.

బొగ్గు ఉత్పత్తికి వినియోగించే
యంత్రాల తయారి వేగవంతం చేయాలి

● సింగరేణి (ఈఅండ్ఎం) డైరెక్టర్ సత్యనారాయణ రావు

రుద్రంపూర్, (సింగరేణి) ఏప్రిల్ 29: సింగరేణి బొగ్గు ఉత్పత్తికి వినియోగించే యంత్రాల తయారీని వేగవంతం చేయాలని సింగరేణి (ఈఅండ్ఎం) డైరెక్టర్ సత్యనారాయణరావు కోరారు. సోమవారం సింగరేణి మెయిన్‌స్టోర్స్‌ను సందర్శించి ఉద్యోగుల పని విధానాలపై సమీక్ష నిర్వహించారు. ఆయన సంబంధిత అధికారులతో బొగ్గు ఉత్పత్తికి ఎలాంటి అంతరాయం ఏర్పడకుండ యంత్రాల వినియోగాన్ని తయారు చేసి అందుబాటులో ఉంచాలన్నారు. సింగరేణి పరిధిలోని వివిధ ఏరియాల్లో ఉన్న స్క్రాప్‌ను ఈ-యాక్షన్ ద్వారా విక్రయాలను చేపట్టాలని కోరారు. సింగరేణి కార్మికులు రక్షణ ప్రమాణాలను ఖచ్చితంగా పాటించి ప్రమాదరహిత సింగరేణిగా రూపొందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈఅండ్ఎం జనరల్ మేనేజరు మాచరయ్య, ఎస్వోటు జీఎం కేవి. రావు, డీజీఎంలు బాలభాస్కర్‌రావు, రమేష్‌కుమార్, రామకృష్ణ, ఎస్ఈ రాజేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశానికి సకాలంలో హాజరు కావాలి

కరకగూడెం, ఏప్రిల్ 29: మండల సర్వసభ్య సమావేశం మే 2న నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 2న ఎంపీపీ రేగా కాళిక అధ్యక్షతన జరగనున్న సర్వసభ్య సమావేశానికి మండలంలోని వివిధ శాఖల అధికారులు 10:30 గంటలకు హాజరు కావాలని తెలిపారు. 30 వ తేదిన మండల స్థాయి అధికారులు 15 ప్రతుల సంబంధించిన నివేదికలను మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో అందించాలని తెలిపారు.

నర్సింగ్ కళాశాల విద్యార్థులకు ఉద్యోగ నియామకాలు

భద్రాచలం, ఏప్రిల్ 29: భద్రాచలంలోని మారుతీ నర్సింగ్ కళాశాలలో బీఎస్సీ నర్సింగ్ కోర్సు పూర్తి చేసిన 40 మంది విద్యార్థులకు క్యాంపస్ సెలక్షన్ ద్వారా ఓమెగా గ్రూప్ ఆసుపత్రి హైదరాబాద్‌లో ఎంపికై ఉద్యోగంలో చేరారు. కళాశాల కార్యదర్శి, కరస్పాండెంటు డాక్టర్ ఎస్ఎల్ కాంతారావు, చైర్మన్ డాక్టర్ బి.సుబ్బరాజు మాట్లాడుతూ నర్సింగ్ వృత్తి పవిత్రమైందని, విధి నిర్వహణ బాధ్యతతో చేపట్టాలని స్పెషాల్టీ విభాగాల్లో నైపుణ్యత పెంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు డాక్టర్ పి.రాజశేఖర్, డాక్టర్ ఎ.మోహన్‌రావు, డాక్టర్ జీవివి సుదర్శన్‌రావు, డాక్టర్ వి.జయభారతి, ఎస్ఎన్‌వి రామారావు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో ముస్లింలకు అన్యాయం

- సీనియర్ నాయకుడు నయీం ఖురేసి


మాట్లాడుతున్న నయీం ఖురేసి

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, ఏప్రిల్ 29: కాంగ్రెస్ పార్టీలో ముస్లీం మైనార్టీ నాయకులకు అవమానం జరుగుతుందని, మైనార్టీ అంటే చిన్న చూపు చూస్తున్నారని సీనియర్ నాయకులు నయీం ఖురేసి ఆగ్రహించారు. సోమవారం పట్టణంలోని ఓల్డ్ డిపో వద్ద గల కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన అత్యవసర సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. పార్టీలు మారిన నాయకులకు అందలం ఎక్కిస్తున్నారని విమర్శించారు. నిబద్ధతతో కాంగ్రెస్ పార్టీ కష్టకాలంలో పని చేసిన నాయకులకు ప్రస్తుతం పార్టీలో ముస్లీ మైనార్టీ నాయకులకు గుర్తింపు లభించడం లేదన్నారు. జిల్లాలో చాలా కాలంగా కాంగ్రెస్‌లో ఉన్న రాష్ట్ర ముస్లీం మైనార్టీ నాయకులు జిల్లా అధ్యక్షులకు మహబూబ్‌ఖాన్ ఈ సన్నాహక సమావేశానికి పిలువలేదన్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ముస్లీం మైనార్టీలు కాంగ్రెస్ పక్షాన నిలబడి తెలంగాణాలో ప్రభుత్వ ఏర్పాటులో కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. ఈ సమావేశంలో మైనార్టీ నాయకులు గౌస్‌పాషా, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీటీసీ ప్రతాప్‌కు తుమ్మల యుగంధర్ పరామర్శ


ఎంపీటీసీని పరామర్శిస్తున్న యుగంధర్

అశ్వారావుపేట, ఏప్రిల్ 29: కాంగ్రెస్ నాయకుడు తుమ్మల యుగంధర్ అశ్వారావుపేట పట్టణంలో పలు కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఇటీవలే రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అశ్వారావుపేట-1 ఎంపీటీసీ వేముల ప్రతాప్‌ని యుగందర్ సోమవారం పరామర్శించారు. అనంతరం పట్టణంలో జరిగిన రిపోర్టర్ రవి కిరణ్ కుమార్తెల ఓణీల పంక్షన్‌లో పాల్గొని చిన్నారులను ఆశీర్వదించారు. ఆయా కార్యక్రమాలలో బండి భాస్కర్, మొగళ్ళపు చెన్నకేశవరరావు, కో ఆప్షన్ సభ్యులు పాషా, జేస్ట సత్యనారాయణ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే డాక్టర్ వెంకట్రావ్ విస్తృత ప్రచారం

దుమ్ముగూడెం ఏప్రిల్ 29: ఎంపీ పోరిక బలరాం నాయక్ గెలుపు కోరూతూ ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు కన్నాపురంలో ప్రచారాన్ని నిర్వహించారు. పోరిక గెలుపు కోసం కాంగ్రెస్ శ్రేణులు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గ అభివృద్ధిని కోరుకునే ప్రతీ ఒక్కరూ కాంగ్రెస్‌కు ఓటేసి బలరాంనాయక్‌ను గెలిపించాలని కోరారు. మాజీ మండలాధ్యక్షుడు లంకా శ్రీనివాసరావు, శ్రీధర్, కెల్లా శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సరస్వతి శిశుమందిర్‌లో ఉచిత కంప్యూటర్, యోగా శిక్షణ

భద్రాచలం, ఏప్రిల్ 29: భద్రాచలంలోని శ్రీ సరస్వతి శిశుమందిర్‌లో మే ఒకటి నుంచి 17వ తేదీ వరకు ఉచిత కంప్యూటర్ శిక్షణ, యోగా క్లాసులు, బుక్ రీడింగ్, కోలాటం మొదలైనవి శిక్షణ ఇస్తామని పాఠశాల అధ్యక్షుడు పాకాల దుర్గా ప్రసాద్ తెలిపారు. ఎనిమిది సంవత్సరాలు పైబడిన పిల్లలందరూ అర్హులేనని భద్రాచలం చుట్టు పక్కల విద్యార్థులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ క్లాసులకు వచ్చే వారు ఉదయం 9 గంటల ఉంచి 11.30 వరకు ఉంటాయని పేర్కొన్నారు. ఈ క్లాసులు కోసం రిజిస్ట్రేషన్ కోసం ఫోన్ నెం. 9866030337 గీత ప్రధానోపాధ్యాయురాలిని సంప్రదించాలని కోరారు.

చిన్నారులను అంగన్‌వాడీకి పంపండి

అశ్వారావుపేట, ఏ ప్రిల్ 29: రెండున్నర సంవత్సరాల వయస్సు నిండిన ప్రతీ ఒక్క బాల బాలికలను అంగన్‌వాడి కేంద్రాల్లో చేర్చాలని జమ్మిగూడెం సెక్టార్ ఐసీడీఎస్ సూపర్ వైజర్ జె వరలక్ష్మి కోరారు. సోమవారం మండల పరిధిలోని కేశప్పగూడెం అంగన్‌వాడీ సెంటర్‌లో ప్రీ స్కూలు అన్యువల్ డేను ఘనంగా నిర్వహించారు. సమావేశంలో పిల్లలు చేసిన కృత్యాలు గురించి తల్లిదండ్రులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కేశప్పగూడెం పీఎస్ ప్రధానోపాధ్యాయులు పరబ్రహ్మాచారి, అంగన్‌వాడీ వర్కర్లు టీ లక్ష్మి కుమారి, పీ వెంకాయమ్మ, హెల్పర్ రమణ లబ్దిదారులు, గ్రామ పెద్దలు హాజరయ్యారు. చిన్నారులకు పలు రకాల బహుమతులను గ్రామస్థులు అందజేశారు.

కార్మిక వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న మోదీ

- మేడే పోస్టర్ ఆవిష్కరించిన ఇఫ్టూ

మణుగూరుటౌన్/గుండాల, ఏప్రిల్ 29: ప్రపంచ కార్మికుల దినోత్సవమై మే డే ప్రచార పోస్టర్లను ఇఫ్టూ జిల్లా నాయకుడు ఎం నాగేశ్వరరావు కార్మికులతో కలిసి ఆవిష్కరించారు. సోమవారం కూనవరం రైల్వే గేటు సమీపంలోని ఇఫ్టూ అనుబంధ రైల్వే కాంట్రాక్ట్ వర్కర్స్ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో ఈ పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలోని మోదీ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఇఫ్టూ నాయకులు

ప్రభుత్వ కార్మిక ప్రజా వ్యతిరేఖ మతోన్మాద ఫాసిస్టు విధానాలకు వ్యతిరేఖంగా, 12 గంటల పని విధానాన్ని, వేతనాల తగ్గింపు, నాలుగు లేబర్ కోడ్‌లను నిరసిస్తూ కార్మిక వర్గం మే డే వేడుకలను నిర్వహించుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఏ మంగిలాల్, కుంటా గురుమూర్తి, ఎం నాగేశ్వరరావు, ఉప్పల శివరామకృష్ణ, కే నాగేశ్వరరావు, ఐ గోపి, కే నాగరాజు, కే శ్రీనివాస్, ఎస్‌కే రజబ్ అలీ, ఎం సమ్మయ్య, ఎం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

గుండాల: కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటాన్ని తీవ్రతరం చేస్తూ 138వ మేడే వేడుకలను ఘనంగా జరుపుకోవాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ జిల్లా నాయకులు కొమరం సీతారాములు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో సోమవారం ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో మేడే పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు పర్శిక రవి, ఈసం క్రిష్ణ, గడ్డం లాలయ్య, పాయం ఎల్లన్న, ఎట్టి గాధయ్య, కల్తి నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు సహకరించాలి

- ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను
- ఇల్లెందు, పినపాకలో ఫ్లాగ్‌మార్చ్

ఇల్లెందుటౌన్/పినపాక, ఏప్రిల్ 29: పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రజలు, ఓటర్లు సహకరించాలని ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను కోరారు. సోమవారం ఇల్లెందు సబ్ డివిజన్ పోలీసులు పట్టణంలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. స్థానిక గోవిందు సెంటరు నుంచి జగదాంబ సెంటరు వరకు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ ఫ్లాగ్‌మార్చ్‌లో వివిధ బెటాలియన్ల పోలీసు సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు. అనంతరం జరిగిన సభలో డీఎస్పీ మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు ప్రతి వ్యక్తి కృషి చేయాలని కోరారు. మే 13న జరిగే లోక్‌సభ ఎన్నికల్లో ఓటర్లందరు పాల్గొనితమ ఓటు హక్కును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఇల్లెందు సీఐ టి. కరుణాకర్‌తోపాటు సబ్ డివిజన్‌కు చెందిన పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యకర సమాజానికి ఓటే వజ్రాయుధం

పినపాక: ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత విలువైన ఆయుధమని, ఓటు హక్కును వినియోగించుకుని ఆరోగ్యకర సమాజాన్ని నిర్మించుకునే బాధ్యత పౌరులపై ఉందని ఏడూళ్లబయ్యారం సీఐ టీ కరుణాకర్ సూచించారు. సోమవారం ఏడూళ్లబయ్యారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మణుగూరు సబ్ డివిజనల్ పోలీసులు ఓటు విలువను తెలుపుతూ, ఓటు హక్కు కలిగిన ప్రతి పౌరుడు ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరుతూ ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. సీఆర్‌పీఎఫ్ డీఎస్పీ వృషాలిని, ఏడూళ్లబయ్యారం సీఐ కరుణాకర్, మణుగూరు సీఐ సతీష్‌కుమార్, ఎస్ఐలు వెంకటప్పయ్య, మేడా ప్రసాద్, రాజేష్, కరకగూడెం ఎస్ఐ రాజేందర్, సిబ్బంది పాల్గొన్నారు.



ఇల్లెందులో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

ప్రభుత్వ వైద్యశాలను సందర్శించిన కమిషనర్

ఇల్లెందుటౌన్, ఏప్రిల్ 29 : ఇల్లెందు ప్రభుత్వ వైద్యశాలను సోమవారం వైద్యవిధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్ సందర్శించారు. వైద్యశాలలో రోగులకు అందుతున్న వైద్యసేవలను రోగులతో మాట్లాడి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ వైద్య విధాన పరిషత్ పరిధిలో ఉన్న ఇల్లెందు వైద్యశాలకు పలు సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం తగిన ప్రణాళికలు రూపొందించిందని వెల్లడించారు. అన్ని కాలాల్లో రోగులకు వైద్యసేవలు అందించేవిధంగా స్థానికంగా ఉన్న వైద్యసిబ్బంది పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇల్లెందు వైద్యులతో పాటు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

తాలిపేరు ప్రాజెక్టు రంగులకు నిధుల మంజూరు

- వచ్చే నెలలో ప్రారంభం కానున్న పనులు

చర్ల, ఏప్రిల్ 23: రైతులు పాలిట కల్ప తరుగా ఉన్న తాలిపేరు ప్రాజెక్టుకు వచ్చే నెలల్లో రంగులు పడనున్నాయి. ఇప్పటికే కోటిన్నర నిధులు మంజూరుకాగా, టెండర్ ప్రక్రియ పూర్తయింది. తాలిపేరు ప్రాజెక్టు 1976 ప్రారంభించి 1986లో నిర్మాణం పూర్తి చేశారు. ఈ కట్టడంతో 60 శాతం ఇనుము వాడారు. అప్పటి నుంచి కుడి, ఎడమ కాల్వల ద్వారా, చర్ల, దుమ్ముగూడెం మండలాల్లోని 24వేల 700 ఎకరాకలు సాగు నీరు అందిస్తోంది. ఖరీఫ్, యాసంగిలో రైతులు రెండు పంటను పడిస్తున్నారు. కాగా ప్రాజెక్టు కట్టిన దగ్గర నుంచి నిర్మాణానికి కలర్ వేయలేదు. దీంతో నిర్మాణం తుప్పు పడుతూ వస్తోంది. ప్రస్తుతం కట్టడంలో 50 శాతం తుప్పు కనిపిస్తోంది. దీంతో ప్రాజెక్టు ఈఈ, రాంప్రసాద్, డీఈ తిరుపతి ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ప్రభుత్వానికి నివేదికలు పంపారు. ప్రాజెక్టుకు రంగులు వేసేందుకు కోట్టిన్నర నిధులు మంజూరయ్యాయి. ఇందుకు సంబందించిన టెండర్ పనులు కూడా పూర్తి అయినట్లు తెలుస్తోంది. మే నెల్లో ఈ పనులు ప్రారంభం కానున్నాయి. అంతా సవ్యంగా జరిగితే జూన్ చవరి వారం కల్లా ప్రాజెక్టు రంగుల్లో కనిపించనుంది.


తాలిపేరు ప్రాజెక్టు

వరదనీరు పోయే మార్గంలేదు

- వివాదాస్పదంగా గుడి ప్రహరీ నిర్మాణం
- రెవెన్యూ మునిసిపల్ ఆదేశాలు బేఖాతరు
- దారి చూపాలంటున్న స్థానికులు

మణుగూరు, ఏప్రిల్ 29: మణుగూరులోని సుందరయ్య నగర్ ముత్యాలమ్మ గుడి ప్రాంగణం వివాదస్పదంగా మారింది. నెల రోజులుగా ఈ వివాదం కొనసాగుతున్నట్లు సమాచారం. ప్రతి ఏటా వరద ముంపునకు గురౌతూ జనావాసాలను నీటి ముంపునకు గురి చేసే ప్రాంతంలో ముత్యాలమ్మ తల్లి గుడి చుట్టూ కట్టే గోడ నిర్మాణం సమస్యాత్మకంగా మారింది. ఈ ప్రాంతంలో నివాసముండే వారికి కనీసం దారి వదల కుండా ప్రహరి నిర్మాణాలు చేపట్టడాన్ని స్థానికులు వ్యతిరేకిస్తూ మణుగూరు మునిపాలిటీ, రెవెన్యూ అధికారులను ఆశ్రయించి న్యాయం చేయాలని కోరారు. ఈ విషయాలపై స్పందించిన రెవెన్యూ అధికారి ఆలయానికి ఎగువ ప్రాంతంలో నివాసముండే వారికి రాకపోకలు జరిపేందుకు మరో మార్గం లేకపోవడంతో అలాగే వరద నీరు నిల్వ ఉండకుండా ఉండేందుకు దారి వదిలి గోడ నిర్మాణాలు చేపట్టాలని సూచినట్లు సమాచారం అంతే కాకుండా బాధితుల ఫిర్యాదు మేరకు కమిషనర్ తమసిబ్బంది పంపి పరిశీలనలు కూడా చేయించారు. సిబ్బంది కూడా ముంపు ప్రాంతంగా ఉండే ఈ ఏరియాలో రోడ్డు తో పాటు కాలువ నిర్మాణాలు చేయాల్సి ఉంటుందని గోడ కట్టడాలు తర్వాత ఈ పనులు సాధ్యం కావని తెలిపారు. గోడను నిర్మించే వారికి రెవెన్యూ అధికారి, టౌన్ ప్లానింగ్ అధికారులు రోడ్డుకు స్థలం వదిలి గోడ నిర్మానాలు చేసుకోండి అని చెప్పినా కూడా వారి అధికారుల ఉత్తర్వులు పట్టించుకోకుండా నిర్మాణ పనులు పూర్తి చేసే పనుల్లో నిమగ్నమైయ్యారు. గత నెల రోజులుగా బేస్ మట్టం నుంచి గోడ పిల్లర్లు, నిర్మాణాలు జరుగుతున్న ప్రతిసారి రెవెన్యూ అధికారులకు, మునిసిపల్ అధికారులకు చెప్పినా కూడా వినని పరిస్థితులు నెలకొన్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆలయానికి స్థలం ఇచ్చాం: శ్రీను దాత

నాడు ఇక్కడ ఆలయ నిర్మాణానికి తమ స్థలాన్నిఇచ్చినం. స్థానికంగా నివాసముండే ఓ మహిళ కొందరితో కలసి చుట్టు పక్క వాళ్ల నడిచేందుకు కనీసం దారి కూడా ఇవ్వకుండా ప్రహరి ఏర్పాటు చేయడం దారుణంగా ఉందని స్థల దాత దర్శినాల శ్రీను తెలిపారు.

అర్బన్ పీహెచ్‌సీ ఏర్పాటు చేయాల్సి ఉండి

కాగా ముత్యాలమ్మ తల్లి ఆలయం ఎదురుగా ఉన్న స్థలంలో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు గత ఎమ్మెల్యే రేగా కాంతారావు శిలాఫలకాన్ని కూడా ఆవిష్కరించిన ఆనవాళ్లు ఇక్కడ ఉన్నాయి. ఎస్‌బీఎఫ్ నిధులు రూ.143 లక్షలను వెచ్చించి ఇక్కడ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని నిర్మించాల్సి ఉంది. కేంద్రానికి కూడా రహదారి సౌకర్యం అవసరం కాగా ఇలా ఆలయానికి చుట్టూరా ప్రహారి ఇతరులకు అసౌకర్యాన్ని కల్గించే విధంగా నిర్మించడం విడ్డూరంగా మారింది. రెవెన్యూ, మునిసిపల్ శాఖ అధికారులు ఉత్తర్వులను సైతం భేఖాతరు చేస్తూ ఇష్టరాజ్య చర్యలకు పరాకాష్టగా మారిన ఈ పనులను, తలెత్తిన సమస్యను, రానున్న వర్షాకాలంలో ముంపు ప్రాంతం నుంచి వరద నీరు బయటికి పంపే మార్గాన్ని ఎలా మరి ఏ శాఖ అధికారి ముందడుగు వేసి పరిష్కరిస్తారో లేక ప్రజలను ఇబ్బందుల పాలు చేస్తారో వేచి చూడాల్సిందే.


ప్రహరి నిర్మాణం జరుగుతున్న దృశ్యం